జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
## ఆదిలాబాద్
మంచిర్యాల-కుమరం భీం-నిర్మల్
మంగళవారం 21 ఏప్రిల్ 2026 పేజీలు : 8



## బాధితుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా గ్రీవెన్స్ డే కార్యక్రమం



# అమరవీరుల ఆశయ సాధనకు కంకణ భద్ధులవుదాం

- అధికారిక స్మరణం- ఆదివా సీల సంబురం
- 45 ఏళ్ల తర్వాత ఇంద్రవెల్లి లో స్వేచ్ఛగా ఘణంగా నివాళి
- అమరుల త్యాగాలను స్మరిం చుకున్న నేతలు

12











## నార్నూర్ లో గుర్తింపును మించిన మార్పు ప్రయాణం

ప్రధాన మంత్రి అవార్డు అనం తర అభివృద్ధి కథ



## మంత్రి జూపల్లి ఆలోచనలకు కార్యరూపం

- ఆదివాసీల 'విజ్ఞాన యాత్ర'
- ఈ నెల 22 న ఉట్నూరులో 'ఆదివాసీ టూరిజం ఎక్స్‌పోజ ర్ ప్రోగ్రామ్'
- ప్రారంభించనున్న మంత్రి జూపల్లి
- సంస్కృతితో పాటు ఆధునిక తను అవలోకనం చేసేలా కా ర్యక్రమ రూపకల్పన



# మంచిర్యాల జిల్లా ఆటో, ఇంజనీరింగ్ వర్కర్స్ యూనియన్ నూతన కమిటీ ఎన్నిక

### హెచ్ఎంఎస్ అనుబంధం -- బలమైన కొత్త కమిటీ ఏర్పాటు,

### కార్మిక హక్కుల కోసం పోరాటం ఉధృతం



**మంచిర్యాల, 20 ఏప్రిల్ (ప్రజా జ్యోతి):** మంచిర్యాల జిల్లా కేంద్రంలో సోమవారం ఆటో అండ్ ఇంజనీరింగ్ వర్కర్స్ యూనియన్ (హెచ్ఎంఎస్ అనుబంధం) ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి తాటిపర్తి సాయి కృష్ణారెడ్డి అధ్యక్షతన సోమవారం జరిగిన ఈ సమావేశం, హెచ్ఎంఎస్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుల ఆదేశాల మేరకు ట్రేడ్ యూనియన్‌ను జిల్లా వ్యాప్తంగా బలోపేతం చేయాలనే లక్ష్యంతో జరిగింది. ఈ సందర్భంగా నరెడ్ల శ్రీనివాస్‌ను జిల్లా అధ్యక్షుడిగా, తగరం శ్రీనివాస్‌ను జిల్లా జనరల్ సెక్రటరీగా, ఎండి షఫీని జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా, దుడ రాజన్నను జిల్లా ఉపాధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. నాయకులు మాట్లాడుతూ, కార్మికుల సమస్యలపై నిరంతరం పోరాటం కొనసాగిస్తామని, ట్రేడ్ యూనియన్‌ను మరింత బలోపేతం చేస్తామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఆటో కార్మికులకు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలులో నిర్లక్ష్యం వహిస్తున్నదని విమర్శిస్తూ, వెంటనే వాటిని అమలు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే ఆటో కార్మికులందరూ ఐక్యంగా ఉండి హెచ్ఎంఎస్ నాయకత్వంలో తమ హక్కుల సాధనకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎంఎస్ ఆటో యూనియన్ నాయకులు బూడిది రమేష్, రాజారెడ్డి, రమేష్, మహేష్, తాజ్ బాబా, అజీముద్దీన్, పల్లపు శ్రీనివాస్, అలీ, సురేష్, క్రాంతి కుమార్, సంపత్ తదితరులు పాల్గొన్నారు. నూతన కమిటీ యూనియన్ బలోపేతంతో పాటు ఆటో కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తుందని నాయకులు తెలిపారు.

# కలెక్టరేట్ ఎదుట సింగరేణి ప్రైవేట్ సెక్యూరిటీ గార్డ్స్ ఆందోళన

### కొత్త టెండర్ పిలిచి కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి

### దుంపల రంజిత్ కుమార్ సీఐటీయూ జిల్లా కార్యదర్శి



**మంచిర్యాల, 20,ఏప్రిల్ 20 (ప్రజా జ్యోతి):** సింగరేణి ప్రైవేట్ సెక్యూరిటీ గార్డుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం జిల్లా కలెక్టరేట్ ఎదుట సింగరేణి కాంట్రాక్టు కార్మిక సంఘం (సీఐటీయూ) ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్ కుమార్ మాట్లాడుతూ, మందమర్రి సింగరేణి ఏరియా పరిధిలో ప్రైవేట్ సెక్యూరిటీ గార్డులు గత 12 సంవత్సరాలుగా విధులు నిర్వర్తిస్తున్నారని తెలిపారు. అయితే గత రెండు నెలలుగా సింగరేణి యాజమాన్యం నిర్లక్ష్యం వల్ల కొత్త టెండర్ పిలవకపోవడంతో కార్మికులు విధులకు దూరమయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాధి కోల్పోయిన కార్మికులు కుటుంబ పోషణ, నిత్యవసర ఖర్చులు, ఇళ్ల అద్దెలు, పిల్లల చదువుల విషయంలో తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. సమస్య పరిష్కారం కోసం గత కొన్ని రోజులుగా కార్మికులు మందమర్రి ప్రాంతంలో నిరసనలు చేపడు తున్నప్పటికీ యాజమాన్యం స్పందించకపో వడం దురదృష్టకరమని విమర్శించారు. జిల్లాలో నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని చెప్పిన కార్మిక శాఖ మంత్రి నియోజక వర్గంలోనే కార్మికులను విధుల నుంచి దూరం చేయడం విచారకరమన్నారు. సుమారు వెయ్యి మంది కుటుంబాలు ఈ సమస్యతో ప్రభావితమవు తున్నాయని తెలిపారు. ఇప్పటికైనా సింగరేణి అధికారులు స్పందించి కొత్త టెండర్ పిలిచి, కార్మికులను యథావిధిగా విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఉద్యమాన్ని మరింత తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు దూలం శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షుడు సంకె రవి, జిల్లా కమిటీ సభ్యులు గోమాస ప్రకాష్, ప్రైవేట్ సెక్యూరిటీ గార్డులు తదితరులు పాల్గొన్నారు.

## వీరాంజనేయ స్వామి దేవాలయ భూమి పూజ కార్యక్రమంలో పాల్గొన్న మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే



**మంచిర్యాల, 20, ఏప్రిల్ (ప్రజా జ్యోతి):**మంచిర్యాల జిల్లా కేంద్రంలోని మేదరివాడలో నూతనంగా నిర్మించబోయే శ్రీ వీరాంజ నేయ స్వామి సహిత శివపంచాయతన దేవాలయ భూమి పూజ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దేవాలయాలు ఆధ్యాత్మికతకు కేంద్రబిందువు లుగా నిలుస్తాయని, సమాజంలో ఐక్యత, సాంప్రదాయ విలువలను పరిరక్షించడంలో కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. దేవాలయ నిర్మాణం పూర్తయిన తర్వాత భక్తులకు మరింత సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని అన్నారు.

## ఆలయ నిర్మాణం కోసం విరాళం అందచేత



**జన్నారం,ఏప్రిల్20(ప్రజాజ్యోతి)** జన్నారం మండల కేంద్రంలోని పొనకల్ గ్రామ పంచాయతీ పరిధిలోని సుందరయ్య నగర్ కాలనీలో నూతనంగా నిర్మిస్తున్న హనుమాన్ దేవాలయానికి మంచిర్యాల జిల్లా అఖిల భారత్ విశ్వకర్మ సంఘమ్ అధ్యక్షులు శ్రీరాముల గంగాధర్ సోమవారం రోజున రూపాయలు 5116 కాలనీ వాసులకు అందచేసి తన భక్తిని చాటుకున్నారు. ఆలయ నిర్మాణానికి సహకరించిన ఆయనను కాలనీవాసులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు డాక్టర్ దేవి దాస్, కామెర కవిత, సవాయి రామ్, జయ, మంజుల తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా నారా చంద్రబాబు నాయుడు పుట్టినరోజు వేడుకలు



**మంచిర్యాల, 20, ఏప్రిల్ (ప్రజా జ్యోతి):** మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి పట్టణంలోని తెలుగుదేశం పార్టీ అనుబంధ కార్మిక సంఘం టీఎన్‌టీయూసీ కార్యాలయంలో నారా చంద్రబాబు నాయుడు 76వ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు, కార్యకర్తలు కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ, సమైక్య ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో చంద్రబాబు నాయుడు హైదరాబాద్‌ను హైటెక్ సిటీగా అభివృద్ధి చేసి లక్షలాది మందికి ఉపాధి అవకాశాలు కల్పించారని గుర్తు చేశారు. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ రంగం భవిష్యత్తులో కీలకమని ముందుగానే గుర్తించి, ఆ దిశగా చర్యలు తీసుకోవడం వల్లే నేడు హైదరాబాద్ ప్రపంచ పటంలో ప్రముఖ ఐటీ కేంద్రంగా నిలిచిందని తెలిపారు. అలాగే ఔటర్ రింగ్ రోడ్డు వంటి ప్రాజెక్టులను ప్రవేశపెట్టి నగర అభివృద్ధికి తోడ్పడినట్టు తెలిపారు. బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసం అనేక పథకాలను అమలు చేసి ప్రజల మన్ననలు పొందారని కొనియాడారు. సింగరేణి సంస్థను ఆర్థిక సంక్షోభం నుంచి బయటపడేసి, కార్మికులకు లాభాల్లో 10 శాతం వాటా కల్పించడం వంటి చర్యలు ఆయన దూరదృష్టికి నిదర్శనమని అన్నారు. నిరుద్యోగు లకు పారదర్శకంగా ఉద్యోగ అవకాశాలు కల్పిస్తూ వేలాది మందికి ఉపాధి కల్పించారని, అలాంటి ప్రజాహిత నాయకుడికి భగవంతుడు ఆయురారోగ్యాలు ప్రసాదించాలని ఆకాంక్షించారు. ఆయన సేవలు ఇరు తెలుగు రాష్ట్రాలకు అవసరమని తెలిపారు. ఈ కార్యక్రమంలో టి. మణి రామ్ సింగ్ (పట్టణ అధ్యక్షులు), ఎస్సీ ఎల్ యు ప్రధాన కార్యదర్శి, ఉపాధ్యక్షులు గద్దెల నారాయణ, బొల్లు మల్లయ్య, పట్టణ ఉపాధ్యక్షులు గజ్జె దుర్గయ్య, అలువాల కుమార్, ఎస్.కె. అస్గర్ బాషా, మోసాడి గోపాల్, బి. సత్యనారాయణ, ఆర్. గంగాధర్ గౌడ్, బి. కుమార్, ఎం. రాజయ్య, పుల్లూరి పోశం తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి పనులను పరిశీలించిన సర్పంచ్

**కూలీలతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్న భీమ్ రావు**



**ఆసిఫాబాద్ ఏప్రిల్ 20 ప్రజా జ్యోతి** ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి మండలం లోని కనర్ గాం(గ్రామ పంచాయతీ పరిధిలో సోమవారం జరుగుతున్న ఉపాధి హామీ పనులను సర్పంచ్ భీమ్ రావు క్షేత్రస్థాయిలో సందర్శించి పరిశీలించారు.పనుల ప్రదేశానికి వెళ్లిన సర్పంచ్ కూలీల హాజరు, పని తీరును పరిశీలించారు. కూలీలతో నేరుగా మాట్లాడి జాబ్ కార్డులు, పేమెంట్లు సకాలంలో అందుతున్నాయా లేదా అని ఆరా తీశారు. పని ప్రదేశంలో తాగునీరు, నీడ వసతి వంటి సౌకర్యాలు ఉన్నాయో లేదో తెలుసుకున్నారు.ఈ సందర్భంగా సర్పంచ్ భీమ్ రావు మాట్లాడు తూ.. ఉపాధి హామీ పథకం ద్వారా ప్రతి కూలీకి పని కల్పించ డమే లక్ష్యమని, పనుల్లో నాణ్యత పాటించాలని సూచించారు. కూలీలకు ఎలాంటి ఇబ్బందులు ఉన్నా తన దృష్టికి తీసుకు రావాలని కోరారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం పారదర్శకంగా పనులు చేపట్టాలని మేట్లకు సూచించారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్, మేట్, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

## ఇందారం లో ఉచిత వైద్య శిబిరం




**జైపూర్, ఏప్రిల్ 20 (ప్రజా జ్యోతి)** జైపూర్ మండలంలోని ఇందారం గ్రామంలో సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్ ఆధ్వర్యంలో సోమవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు, గ్రామపంచాయతీ కార్యాలయంలో జరిగిన ఈ శిబిరానికి గ్రామస్తులు పెద్ద సంఖ్యలో హాజరై పరీక్షలు చేయించుకున్నారు. ఈ సందర్భంగా ఎస్టిపిపి ఈడి సి.హెచ్. చిరంజీవి మాట్లాడుతూ ప్లాంట్ ప్రభావిత గ్రామాల ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం ఇలాంటి శిబిరాలు నిర్వహిస్తున్నామని తెలిపారు,వ్యాధులను ముందుగానే గుర్తించి నివారణ చర్యలు తీసుకోవడం లక్ష్యమని చెప్పారు.డా. కె. పవన్ తెలిపిన వివరాల ప్రకారం శిబిరంలో మహిళలు, వృద్ధులు, చిన్నారులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు ఉచితంగా పంపిణీ చేశారు.ఈ మేరకు స్థానిక ప్రజలు ఈ కార్యక్రమాన్ని అభినందించారు.

## ఎస్సీ వర్గీకరణ, కులగణనలో నేతకాని మహర్ వర్గానికి అన్యాయం




**మంచిర్యాల, 20, ఏప్రిల్ (ప్రజా జ్యోతి):** ఎస్సీ వర్గీకరణ, కులగణనలో నేతకాని మహర్ సామాజిక వర్గానికి తీవ్ర అన్యాయం జరిగిందని నేతకాని మహర్ సంక్షేమ సంఘం మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు సునార్కర్ రాంబాబు, రాష్ట్ర అధికార ప్రతినిధి గోళ్ల రాజమల్లు ఆరోపించారు. సోమవారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ, రాష్ట్ర జనాభాలో నేతకానీలు 15 లక్షలకు పైగా ఉన్నప్పటికీ, ఇటీవల నిర్వహించిన కులగణన లో కేవలం 1 లక్ష 70 వేల 254 మందిగానే చూపించారని విమర్శించారు. ఈ తేడా కారణంగా ఎస్సీ వర్గంలో తమ వర్గం తీవ్రంగా నష్టపోతుందని తెలిపారు. నేతకానీలను మాలసాలె వర్గంతో కలపడం సరైంది కాదని, ఈ రెండు వర్గాలకు ఎలాంటి సంబంధం లేదని వారు స్పష్టం చేశారు. మాలలతో కలిపి ఉంచడం వల్ల నేతకాని మహర్ వర్గం రాజకీయ, ఆర్థిక, సామాజికంగా వెనుకబ డుతోందని ఆవేదన వ్యక్తం చేశారు.రాష్ట్ర యువజన అధ్యక్షుడు అనపర్తి యువరాజు మాట్లాడుతూ, నేతకాని వర్గ అభివృద్ధి కోసం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి, చైర్మన్‌ను నియమించి తగిన నిధులు కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరారు.ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా అధ్యక్షురాలు కామెర అనూష, జిల్లా ఉపాధ్యక్షులు జాడి తిరుపతి, జిల్లా అధికార ప్రతినిధి కొండగొర్ల శ్రీనివాస్, నస్పూర్ మండల అధ్యక్షుడు దుర్గం శివరాం, బెంబడి గురువయ్య, ముడిమడుగుల శ్రీనివాస్, జునుగురు లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి





**జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**

**మంచిర్యాల, 20, ఏప్రిల్ (ప్రజా జ్యోతి):** ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం మంచిర్యాల జిల్లాలోని నస్పూర్‌లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి. చంద్రయ్య, జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) రాములతో కలిసి అర్జిదారుల నుండి దరఖాస్తులు స్వీకరించారు.నెన్నెల మండలం నార్వాయిపేట గ్రామానికి చెందిన కైరత్ పాషా తమ తాతల నుండి వార సత్వంగా వస్తున్న భూమిని కొందరు అక్రమంగా మార్చి పట్టా చేసుకున్నారని, ఈ విషయమై సమగ్ర విచారణ జరిపి న్యాయం చేయాలని అర్జీ సమర్పించారు. మంచిర్యాల పట్టణానికి చెందిన సాయిని శ్రీనివాస్ హాజీపూర్ మండలం దొనబండ గ్రామ శివారులో గల భూమి వివరాలను భూభారతి పోర్టల్‌లో నవీకరించి పట్టా పాస్ పుస్తకం మంజూరు చేయాలని కోరారు. తాండూర్ మండలం బోయపల్లి గ్రామానికి చెందిన ఎలిగేటి సాయికుమార్ తమ వారసత్వ భూమిని సమాచారం లేకుండా విక్రయించారని, న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. కన్నెపల్లి మండలం సాలిగాం గ్రామానికి చెందిన తాళ్లపల్లి నరేష్ తాను కొనుగోలు చేసిన భూమిని తన పేరిట ఆన్లైన్‌లో నమోదు చేయాలని కోరారు. దండేపల్లి మండల కేంద్రానికి చెందిన గుండా రవీందర్ తల్లిదండ్రుల పోషణ చట్టం ప్రకారం ప్రభుత్వ ఉద్యోగి అయిన తన కుమారుని నుండి ప్రతినెల నగదు ఇప్పించాలని దరఖాస్తు చేశారు. మంచిర్యాల పట్టణానికి చెందిన కొత్త మాధవి, కొత్త కిరణ్ మానసిక దివ్యాంగులైన తమకు పెన్షన్ మంజూరు చేయాలని వేరువేరుగా అర్జీలు సమర్పించారు. తిలక్‌నగర్‌కు చెందిన లింగన్నపేట సత్యనారాయణ వృద్ధాప్య పింఛన్ కోరగా, లక్సెట్టిపేట మండలం పోతపల్లి గ్రామానికి చెందిన ఆవునూరి రాయలింగు తన భూమి ప్రభుత్వ రికార్డుల్లో నమోదు కాలేదని, పట్టా ఇప్పించాలని వినతి చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి, అధికారుల సమన్వయంతో వేగంగా పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఆసిఫాబాద్ బిడ్డకు అంతర్జాతీయ గౌరవం సామాజిక కార్యకర్తకు డాక్టరేట్ పట్టం

**బుద్ధ ధమ్మ ప్రచారకుడికి అరుదైన గుర్తింపు**

**గిరిజనుల అభివృద్ధికి పాటుపడిన నేతకు సత్కారం**




**ఆసిఫాబాద్ ఏప్రిల్ 20 ప్రజా జ్యోతి** ఆసిఫాబాద్ జిల్లా భారతీయ బౌద్ధ మహాసభ అధ్యక్షుడు అశోక్ మహుల్కర్‌కు పూణేలోని ఇంటర్నేషనల్ లూసియానా రీసెర్చ్ అమెరికన్ యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్ ప్రదానం చేసింది. ఈ నెల 19న జరిగిన స్నాతకోత్సవంలో బిరుదు అందజేశారు.ఉస్మానియా యూనివర్సిటీ నుంచి సోషియాలజీలో ఎం.ఫిల్ చేసిన అశోక్ మూడు దశాబ్దాలుగా సామాజిక సేవ చేస్తున్నారు. 'క్రీడ్' సంస్థ ద్వారా ఉచిత వైద్య శిబిరాలు, ఐటీడీఏలో 7 ఏళ్లు గిరిజనాభివృద్ధికి పనిచేశారు. అంబేద్కర్ సెంటర్ కమిటీ, బౌద్ధ మహాసభ జిల్లా అధ్యక్షుడిగా అంబేద్కర్, బుద్ధుడి సిద్ధాంతాలను ప్రచారం చేశారు. భూటాన్ బుద్ధ ధమ్మ యాత్రలో 'బెస్ట్ ప్రమోటర్ అవార్డు' పొందా రు.2008లో కొండా లక్ష్మణ్ బాపూజీతో 'లక్ష్మణ సేవాసదన్ వెల్ఫేర్ సొసైటీ' ఏర్పాటు చేసి నిరుపేదలకు వైద్య, విద్యా సేవలు అందిస్తున్నారు. ఆయన సేవలను గుర్తించి యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్ ఇచ్చినట్లు అశోక్ తెలిపారు. అణగారిన వర్గాల చైతన్యం కోసం అందరూ కృషి చేయాలని కోరారు

# మంచిర్యాల జిల్లాలో డయాలసిస్ సేవల విస్తరణకు చర్యలు

## జిల్లా స్థాయిలో త్రీ మెన్ కమిటీ పరిశీలనలు



**మంచిర్యాల, 20, ఏప్రిల్ (ప్రజా జ్యోతి):**తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ వైద్య ఆరోగ్యశాఖ సంచాలకుల ఆదేశాల మేరకు మంచిర్యాల జిల్లాలో డయాలసిస్ సేవలను విస్తరించేందుకు చర్యలు ప్రారంభమయ్యాయని మంచిర్యాల జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్. అనిత తెలిపారు. కొత్తగా ఏర్పాటు చేయనున్న డయాలసిస్ కేంద్రాలతో పాటు ఇప్పటికే ఉన్న కేంద్రాలలో అదనపు డయాలసిస్ బెడ్స్ ఏర్పాటు చేయడానికి జిల్లా స్థాయిలో త్రీ మెన్ కమిటీ పరిశీలనలు చేపట్టింది.ఈ కమిటీ జిల్లాలోని సామాజిక ఆరోగ్య కేంద్రాలు లక్షెట్టిపేట్, వేమనపల్లి, భీమిని ప్రాంతాల్లో కొత్తగా ఏర్పాటు చేయనున్న డయాలసిస్ కేంద్రాల కోసం ప్రతి కేంద్రంలో ఐదు బెడ్స్ చొప్పున ఏర్పాటు చేసే అవకాశాలను పరిశీలించింది. అదేవిధంగా జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో అదనంగా రెండు డయాలసిస్ బెడ్స్ ఏర్పాటు చేయడానికి కూడా సమీక్ష నిర్వహించింది.ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్. అనిత, ఆర్ఎంఓ డాక్టర్ శ్రీధర్, డాక్టర్ ఆకుల శ్రీనివాస్, డాక్టర్ అప్పల ప్రసాద్, డిపిఓ ప్రశాంతి మరియు నర్సింగ్ అధికారులు లక్షెట్టిపేట్ సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. మరో కమిటీ భీమిని, వేమనపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను పరిశీలించింది.సందర్శనలో భాగంగా వైద్యులు ఫిజీషియన్, అనస్తీషియా నిపుణుల అందుబాటు, పేషంట్ కేర్ ప్రొవైడర్లు, డయాలసిస్ కేంద్రం ఏర్పాటు చేయడానికి తగిన స్థలం, పరీక్షల కోసం తెలంగాణ డయాగ్నొస్టిక్స్ సౌకర్యం, నీటి సౌకర్యం, ఇన్‌పేషెంట్ రోగుల బంధువులకు అవసరమైన సదుపాయాలు తదితర అంశాలను సమీక్షించారు. పరిశీలన అనంతరం సమగ్ర నివేదికను జిల్లా కలెక్టర్‌కు మరియు ఆరోగ్యశాఖ కమిషనర్‌కు సమర్పించనున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ కార్యక్రమం ద్వారా డయాలసిస్ రోగులకు సమీపంలోనే మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి రానున్నాయి. దీంతో ప్రజలకు ఆరోగ్య సేవలు మరింత సులభంగా లభించనున్నాయని అధికారులు తెలిపారు.

# ప్రగతి స్టేడియం 34 వసంతాల్లో పాల్గొనడం గర్వంగా భావిస్తున్నాను

### తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం (టీబీజీకేఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. సురేందర్ రెడ్డి



**మంచిర్యాల, 20, ఏప్రిల్ (ప్రజా జ్యోతి):**'ప్రగతి స్టేడియం పిలుస్తోంది రా...' అనే నినాదంతో నిర్వహించిన 34 ఏళ్ల ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొనడం గర్వంగా భావిస్తున్నట్లు తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం (టీబీజీకేఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, సింగరేణి రిటైర్డ్ డిప్యూటీ సూపరింటెండెంట్ కె. సురేందర్ రెడ్డి తెలిపారు.మంచిర్యాల జిల్లా శ్రీరాంపూర్ లోని ప్రగతి స్టేడియం 34 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆదివారం రాత్రి ఘనంగా నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్టేడియం నిర్మాణానికి పడిన కష్టాలను, కార్యక్రమం కోఆర్డినేటర్ జి. యాదిరెడ్డి తో పాటు తాను చేసిన కృషిని వివరించారు.ఈ ప్రత్యేక సందర్భంలో కళాకారులు, క్రీడాకారులు, అధికారులు ఒకే వేదికపై కలుసుకోవడం ఎంతో ఆనందదాయకమని పేర్కొన్నారు. తన విద్యార్థి దశలో ఫుట్‌బాల్, వాలీబాల్, కబడ్డీ క్రీడల్లో విశ్వవిద్యాలయ స్థాయిలో ప్రాతినిధ్యం వహించినట్లు తెలిపారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు 7 సంవత్సరాల పాటు కబడ్డీ కార్యదర్శిగా, రాష్ట్ర కబడ్డీ సెలక్షన్ కమిటీ సభ్యుడిగా, ఒలింపిక్ సంఘ సభ్యుడిగా సేవలందించినట్లు చెప్పారు. 1982లో సింగరేణి ఉద్యోగంలో చేరిన అనంతరం, శ్రీనివాస్ రెడ్డి స్మారకార్థంగా 'శ్రీనివాస్ రెడ్డి మెమోరియల్ కబడ్డీ, వాలీబాల్ టోర్నమెంట్'లను నిర్వహించి, ప్రగతి స్టేడియం యాజమాన్య సహకారంతో విజయవంతం చేసిన సందర్భాలను గుర్తుచేసుకున్నారు.పూర్వంలో పిచ్చి మొక్కలతో ఉన్న మైదానాన్ని అభివృద్ధి చేసి సమగ్ర క్రీడా ప్రాంగణంగా తీర్చిదిద్దిన ఘనత సింగరేణిదేనని అన్నారు. రాష్ట్ర, జాతీయ స్థాయి టోర్నమెంట్లతో పాటు ఖేలో ఇండియా స్థాయి పోటీలు నిర్వహించడం ద్వారా జిల్లాకు మంచి పేరు తీసుకువచ్చిందన్నారు. ఈ స్టేడియంలో శిక్షణ పొందిన క్రీడాకారులు అనేక బహుమతులు సాధించారని కొనియాడారు. కార్మిక సంఘ నాయకుడిగా తన బాధ్యతలను వివరించిన ఆయన, 2015 నుంచి 2023 వరకు అధికార కార్మిక సంఘమైన టీబీజీకేఎస్‌లో శ్రీరాంపూర్ వైస్ ప్రెసిడెంట్‌గా పనిచేసి కార్మికుల సమస్యలను యాజమాన్యంతో చర్చించి పరిష్కరించేందుకు కృషి చేసినట్లు తెలిపారు. ప్రస్తుతం రాష్ట్ర జనరల్ సెక్రటరీగా బాధ్యతలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రగతి స్టేడియం 34 సంవత్సరాల సందర్భంగా నిర్వహించిన ఆత్మీయ మహాసమ్మేళనం, అలయ్-బలయ్ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన నిర్వాహకులు, క్రీడాకారులు, కళాకారులు, అధికారులకు ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

# మంచిర్యాలలో జనాభా లెక్కల శిక్షణ కార్యక్రమం ప్రారంభం



**మంచిర్యాల, 20, ఏప్రిల్ (ప్రజా జ్యోతి):** కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు 2027 జనాభా లెక్కల నిర్వహణ కోసం మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఏర్పాట్లు వేగవంతంగా కొనసాగుతున్నాయి. ఈ క్రమంలో మొత్తం 318 మంది ఎన్యూమరేటర్లు మరియు 58 మంది సూపర్వైజర్లు నియమించబడ్డారు. శిక్షణ కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించేందుకు ప్రతి బ్యాచ్‌లో 50 మంది చొప్పున రోజుకు మూడు బ్యాచులుగా, ప్రతి బ్యాచ్‌కు సోమవారం నుంచి మూడు రోజులపాటు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా, మంచిర్యాలలోని కార్మెల్ స్కూల్‌లో సోమవారం మూడు బ్యాచులకు చెందిన మొత్తం 150 మందికి శిక్షణ తరగతులు ప్రారంభమ య్యాయి. శిక్షణలో జనాభా లెక్కల సేకరణ విధానం, డిజిటల్ పద్ధతుల వినియోగం, సమాచార గోప్యత, ఖచ్చితత్వంపై ప్రత్యేకంగా అవగాహన కల్పిస్తున్నారు. అధికారులు శిక్షణ కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తూ సిబ్బంది విధులను సమర్థవంతంగా నిర్వహించేలా మార్గనిర్దేశం చేస్తున్నారు. జనాభా లెక్కల ప్రక్రియను పారదర్శకంగా, ఖచ్చితంగా పూర్తి చేయాలని సూచించారు.

# ప్రజావాణి అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యం వద్దు

### బాధ్యతగా వ్యవహరించాలని అధికారులకు కలెక్టర్ హరిత ఆదేశం



**ఆసిఫాబాద్, ఏప్రిల్ 20 ప్రజా జ్యోతి** ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చిన అర్జీలను నిర్లక్ష్యం చేయకుండా త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అధికారులను ఆదేశించారు.సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఆర్డీఓతో కలిసి కలెక్టర్ ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. జిల్లా నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో వచ్చిన ప్రజలు భూ సమస్యలు, పెన్షన్లు, రేషన్ కార్డులు, ఇళ్ల స్థలాలు, ఉపాధి పనుల బిల్లులకు సంబంధించిన సమస్యలపై అర్జీలు అందజేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజావాణి ఒక ముఖ్యమైన వేదిక అని అన్నారు. ప్రజలు ఎంతో నమ్మకంతో తమ సమస్యలను అధికారుల దృష్టికి తెస్తున్నారని, వాటిని బాధ్యతగా తీసుకొని సత్వరమే పరిష్కరించాలని సూచించారు. అందిన ప్రతి దరఖాస్తును సంబంధిత శాఖ అధికారికి పంపి, నిర్ణీత గడువులోగా పరిష్కారం చూపాలన్నారు.అర్జీల పరిష్కారంలో జాప్యం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి అర్హులకు న్యాయం చేయాలని, అనవసరంగా పెండింగ్‌లో ఉంచొద్దని స్పష్టం చేశారు. ప్రజావాణి దరఖాస్తుల స్థితిగతులపై వారానికోసారి సమీక్షిస్తామని తెలిపారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు

# బొగ్గు గని కార్మికుల ప్రయోజనాలపై కీలక నిర్ణయాలు

## జేబీసీసీఐ--ఎలెవన్ స్టాండర్డైజేషన్ కమిటీ సమావేశం

### హింద్ మజ్దూర్ సభ (హెచ్ఎంఎస్) ప్రధాన కార్యదర్శి రియాజ్ అహ్మద్ వెల్లడి

**మంచిర్యాల, 20, ఏప్రిల్ (ప్రజా జ్యోతి):** భువనేశ్వర్‌లో జరిగిన జేబీసీసీఐ--ఎలెవన్ స్టాండర్డైజేషన్ కమిటీ సమావేశంలో బొగ్గు గని కార్మికుల ప్రయోజనాలకు సంబంధించిన కీలక నిర్ణయాలు తీసుకొని, పలు అంశాలపై విస్తృతంగా చర్చలు జరిపినట్లు ఈ సమావేశంలో పాల్గొన్న హింద్ మజ్దూర్ సభ (హెచ్ఎంఎస్) ప్రధాన కార్యదర్శి రియాజ్ అహ్మద్ సోమవారం తెలిపారు. ఏప్రిల్ 17న నిర్వహించిన ఈ సమావేశంలో కార్మికుల సమస్యలపై ఆయన గళం వినిపించి, ముఖ్య అప్‌డేట్స్ వివరించారు.సమావేశంలో ప్రధానంగా వారసత్వ ఉద్యోగాల దరఖాస్తు గడువును ఒక సంవత్సరం నుంచి మూడు సంవత్సరాలకు పెంచడం జరిగింది. మెడికల్ ఇన్వాలిడేషన్ లేదా కార్మికుడు మరణించిన సందర్భాల్లో కుటుంబ సభ్యులకు ఈ నిర్ణయం ద్వారా మరింత సమయం లభించనుంది. మెడికల్ ఇన్వాలిడ్‌కు సంబంధించిన 9.4.0 క్లాజును రద్దు చేయాలన్న కోల్ ఇండియా యాజమాన్యం ప్రతిపాదనను హెచ్ఎంఎస్ తీవ్రంగా వ్యతిరేకించింది. కార్మికులకు నష్టం కలిగించే ఈ అంశంపై పూర్తి స్థాయి చర్చ కోసం సబ్ కమిటీ ఏర్పాటు చేయాలని యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. డిపార్ట్‌మెంటల్ అనుమతితో ఎలక్ట్రిక్ సూపర్వైజర్, మైనింగ్ సర్దార్, సర్వేయర్ పరీక్షల్లో ఉత్తీర్ణులై సర్టిఫికెట్‌ను కంపెనీలో జమ చేసిన కార్మికులకు ఒక లక్ష రూపాయల ప్రోత్సాహకం ఇవ్వాలని నిర్ణయించారు. మహిళా సెక్యూరిటీ గార్డుల నియామకానికి కనీస ఎత్తును నాలుగు అడుగులు ఎనిమిది అంగుళాలుగా ఖరారు చేశారు. అలాగే వారసత్వ ఉద్యోగాలకు సంబంధించిన స్టాండర్డ్




ఆపరేటింగ్ ప్రొసీజర్ (ఎస్ఓపీ)ను 2021 జూలై 1 నుండి అమలు చేయాలని అంగీకరించారు. దీని వల్ల పెండింగ్‌లో ఉన్న కేసులు పరిష్కారమయ్యే అవకాశం ఉంది.కోల్ ఇండియా వ్యాప్తంగా కార్మికులకు ఒకే విధమైన డ్రెస్ కోడ్‌ను అమలు చేయాలని నిర్ణయించారు. పురుషులకు గ్రే రంగు షర్ట్, బ్లాక్ రంగు ప్యాంట్‌ను ఖరారు చేయగా, మహిళల డ్రెస్ కోడ్‌పై డైరెక్టర్ (హెచ్ఆర్) త్వరలో నిర్ణయం తీసుకోనున్నారు.వచ్చే జూన్ నెలలో ప్రారంభం కానున్న వేజ్ బోర్డు--ట్వెల్వ్ (ఎన్‌సిడబ్ల్యుఏ--ట్వెల్వ్) కోసం కమిటీ ఏర్పాటుపై చర్చించారు. త్వరలోనే తదుపరి సమావేశం నిర్వహించి తేదీలను ఖరారు చేయనున్నారు.కొత్త లేబర్ కోడ్స్ అమలుపై కార్మికుల్లో ఉన్న సందేహాలను యూనియన్లు సమావేశంలో ప్రస్తావించగా, పూర్తి స్పష్టత వచ్చే వరకు అమలులో తొందరపడబోమని యాజమాన్యం సాను కూలంగా స్పందించినట్లు రియాజ్ అహ్మద్ తెలిపారు. ఈ నిర్ణయాలు బొగ్గు గని కార్మికుల సంక్షేమానికి ఉపయోగపడతాయని ఆయన అభిప్రాయపడ్డారు.

# కేంద్ర పర్యావరణ నిబంధనలతోనే గనుల ఉత్పత్తి జరగాలి

## శ్రీరాంపూర్ ఏరియా జీఎం మునిగంటి శ్రీనివాస్

**మంచిర్యాల, 20, ఏప్రిల్ (ప్రజా జ్యోతి):** కేంద్ర పర్యావరణ శాఖ నిబంధనలకు లోబడి గనుల ఉత్పత్తి నిర్వహించాలని శ్రీరాంపూర్ ఏరియా జీఎం మునిగంటి శ్రీనివాస్ సూచించారు. సోమవారం శ్రీరాంపూర్ ఏరియా పరిధిలోని భూగర్భ గనులు, ఉపరితల గనుల్లో కొనసాగుతున్న ఉత్పత్తి, ఉత్పాదకతతో పాటు పర్యావరణ పరిరక్షణ చర్యలపై సమీక్షను నిర్వహించారు. శ్రీరాంపూర్ ఏరియా జీఎం కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో అన్ని గ్రూపుల ఏజెంట్లు, ప్రాజెక్ట్ ఆఫీసర్లు, మేనేజర్లు, విభాగాధిపతులు, సేఫ్టీ ఆఫీసర్లు,ఇతర అధికారులతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా గనుల్లో కొనసాగుతున్న ఉత్పత్తి ప్రాంతాలు, విస్తరణలో భాగంగా ప్రారంభించాల్సిన కొత్త ప్రదేశాలు, వాటికి అవసరమైన పర్యావరణ అనుమతులు, నిబంధనల అమలు వంటి అంశాలపై విస్తృతంగా చర్చించారు. బొగ్గు ఉత్పత్తి కారణంగా కాలుష్యం పెరగకుండా పర్యావరణ హిత చర్యలు చేపట్టాలని జీఎం స్పష్టం చేశారు. ఈ సందర్భంగా శ్రీరాంపూర్ ఏరియా పర్యావరణ అధికారి హనుమాన్ గౌడ్ పీపీటీ ప్రెజెంటేషన్ ద్వారా పర్యావరణ పరిరక్షణ చర్యలను వివరించారు. పర్యావరణ విభాగం



నివేదికలను పరిశీలించిన జీఎం మునిగంటి శ్రీనివాస్, కేంద్ర పర్యావరణ శాఖ మార్గదర్శకాల ప్రకారం గనుల కార్యకలాపాలు కొనసాగించా ల్సిన అవసరం ఉందని, పర్యావరణ పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని అధికారులకు సూచించారు.ఈ కార్యక్రమంలో ఎస్ఓటీరీ జీఎం ఎన్. సత్యనారాయణ, ఏరియా ఇంజనీర్ రమణా రావు, ఐకే ఓసీ ప్రాజెక్ట్ ఆఫీసర్ ఏ.వి. రెడ్డి, ఎస్ఆర్పీ ఓసీ ప్రాజెక్ట్ ఆఫీసర్ సీహెచ్. వెంకటేశ్వర్లు, ఆర్కే-5 గ్రూప్ ఏజెంట్ ఎన్. శ్రీధర్, ఏరియా పర్యావరణ అధికారి హనుమాన్ గౌడ్, విభాగాధిపతులు, గనుల మేనేజర్లు, రక్షణ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# భూమి సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

### మదర్ ఎర్త్ ఫోర్ట్‌నైట్ పోస్టర్ ఆవిష్కరించిన కలెక్టర్ హరిత




**ఆసిఫాబాద్ ఏప్రిల్ 20 ప్రజా జ్యోతి** పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో చైతన్యం కలిగించేందుకు తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో ఈ నెల 15 నుంచి 30 వరకు నిర్వహిస్తున్న 'ఇంటర్నేషనల్ మదర్ ఎర్త్ ఫోర్ట్‌నైట్' కార్యక్రమంలో భాగంగా ఆదివారం జిల్లా కేంద్రంలో పోస్టర్‌ను కలెక్టర్ హరిత ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. నేల సంరక్షణ ప్రతి పౌరుడి బాధ్యత అని అన్నారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా తగ్గించాలని, సేంద్రియ ఎరువుల వాడకం పెంచాలని సూచించారు. పంట కవర్లు, చెట్ల పెంపకంతో నేల కోతను అరికట్టవచ్చని తెలిపారు.పోస్టర్‌లో నేల పరిరక్షణ, ప్లాస్టిక్ నిషేధం, సేంద్రియ వ్యవసాయం వంటి కీలక అంశాలను పొందుపరిచినట్లు నిర్వాహకులు తెలిపారు. విద్యార్థులు, యువతలో పర్యావరణంపై అవగాహన పెంచడమే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు.కార్యక్రమంలో జాతీయ హరిత దళం రీజనల్ ప్రాజెక్ట్ అధికారి విద్యాసాగర్, జిల్లా కోఆర్డినేటర్ కటకం మధూకర్ తదితరులు పాల్గొన్నారు.

# ఛలో కాటారం... రైతు భరోసా విడుదలకు భారీ బహిరంగ సభ

### మంచిర్యాల నుంచి భారీగా తరలివెళ్లిన రైతులు, నాయకులు



**మంచిర్యాల, 20, ఏప్రిల్ (ప్రజా జ్యోతి):** భూపాలపల్లి జిల్లా కాటారంలో సోమవారం నిర్వహించిన రైతు భరోసా నిధుల విడుదల కార్యక్రమం కు మంచిర్యాల జిల్లా నలుమూలల నుంచి, మంచిర్యాల నుంచి భారీగా కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్త లు రైతులు తరలి వెళ్లారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ బహిరంగ సభకు జిల్లాల నలుమూలల నుండి పెద్ద సంఖ్యలో రైతులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు తరలివచ్చారు.ఈ కార్యక్రమానికి మంచిర్యాల శాసన సభ్యులు కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు నాయకత్వంలో మంచి ర్యాల జిల్లా నుంచి, మంచిర్యాల పట్టణం నుంచి విశేష స్పందన లభించింది. వందలాది మంది రైతులు, పార్టీ కార్యకర్తలు, అభిమానులు భారీగా కాటారం వైపు తరలి వెళ్లి సభను విజయవంతం చేశారు. మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్‌కు చెందిన మేయర్, డిప్యూటీ మేయర్, కార్పొరేటర్లు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు ఈ కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్నారు. రైతు సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని, రైతు భరోసా నిధుల విడుదల ద్వారా రైతులకు ఆర్థిక భరోసా కల్పిస్తున్నామని నాయకులు పేర్కొన్నారు.ఈ సందర్భంగా సభ ప్రాంగణం జన సందోహంతో కళకళలాడింది. రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం చేపడుతున్న పథకాలకు విస్తృత మద్దతు లభిస్తున్నదని, భవిష్యత్తు లో కూడా రైతులకు మరింత సహాయం అందించేందుకు కృషి చేస్తామని నాయకులు తెలిపారు.

# ఇంటర్ ఫలితాల టాపర్ చిన్నారులు భవిష్యత్తుల్లో ఉన్నత హోదాల్లో స్థిరపడాలి

## వారి తల్లిదండ్రులకు, సింగరేణి సంస్థకు గర్వకారణంగా నిలవాలి

## శ్రీరాంపూర్ ఏరియా జిఎం మునిగంటి శ్రీనివాస్

**మంచిర్యాల, 20, ఏప్రిల్ (ప్రజా జ్యోతి):** ఇంటర్ ఫలితాల టాపర్లుగా నిలిచిన చిన్నారులు భవిష్యత్తుల్లో ఉన్నత హోదాల్లో స్థిరపడి వారి తల్లిదండ్రులకు, సింగరేణి సంస్థకు గర్వకారణంగా నిలవాలని మంచిర్యాల జిల్లా శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ మునిగంటి శ్రీనివాస్ ఆకాంక్షించారు. ఇటీవల విడుదలైన తెలంగాణ ఇంటర్మీడియట్ ఫలితాల్లో స్టేట్ టాపర్లుగా నిలిచిన శ్రీరాంపూర్ ఏరియా సింగరేణి ఉద్యోగుల పిల్లలను ప్రత్యేకంగా అభినందించారు. తెలంగాణ ఇంటర్ ఫలితాల్లో సింగరేణి వారసులు సత్తా చాటారు. శ్రీరాంపూర్ ఏరియా ఉద్యోగుల పిల్లలు రాష్ట్ర స్థాయిలో అద్భుత ర్యాంకులు సాధించారు. ఏకంగా స్టేట్ ఫస్ట్, స్టేట్ సెకండ్ ర్యాంకులతో రాణించారు. శ్రీరాంపూర్ ఏరియా పరిధిలోనూ నలుగురు వారసులు ఇంటర్ ఫలితాల్లో స్టేట్ టాపర్లుగా నిలవగా, ఆ నలుగురు అమ్మాయిలే కావడం గర్వకారణంగా నిలిచింది. శ్రీరాంపూర్ ఏరియా జిఎం కార్యాలయంలో సీనియర్ ఐటీ ప్రోగ్రామర్‌గా విధులు నిర్వహిస్తున్న గొల్లాల శ్రీనివాస్ ఇద్దరు కవల కూతురులు ఇంటర్లో సరస్వతి పుత్రికలుగా నిలిచారు. ఇంటర్ ఫస్ట్ ఇయర్ ఎంఈసీ విభాగంలో 500 మార్కులకు గాను 496 మార్కులతో కవలల్లో ఒక అమ్మాయి ఇందు ప్రసన్న స్టేట్ ఫస్ట్ మార్క్ సాధించగా, 489 మార్కులతో స్టేట్ సెవెన్త్ ర్యాంకు సాధించింది మరో కూతురు శరణ్య. జిఎం కార్యాలయంలోని ఫైనాన్స్ విభాగంలో జూనియర్ అకౌంటెంట్‌గా విధులు నిర్వహిస్తున్న ఆడెపు బిక్షపతి కూతురు ఆధ్యశ్రీ సైతం ఇంటర్ మొదటి సంవత్సరం లో 440 మార్కులకు గాను 437 మార్కులతో స్టేట్ థర్డ్ ర్యాంకు సాధించింది. వీరితో పాటు ఆర్కే-ఐదు గనిలో జనరల్ అసిస్టెంట్‌గా విధులు




నిర్వహిస్తున్న రెంక చంద్రమౌళి కూతురు రెంక వైష్ణవి ఇంటర్ సెకండ్ ఇయర్ బయపీసీ విభాగంలో 1000 మార్కులకు గాను 995 మార్కులతో రాష్ట్ర స్థాయిలో సెకండ్ ర్యాంకు సాధించింది. ఈ ముగ్గురు చిన్నారులను, ఆడెపు ఆధ్యశ్రీ తండ్రి బిక్షపతిని శ్రీరాంపూర్ ఏరియా జిఎం మునిగంటి శ్రీనివాస్ ప్రత్యేకంగా అభినందించారు. ఒక్కొక్కరిని వారి మార్కులు, సాధించిన ర్యాంకు గురించి అడిగి శుభాకాంక్షలు తెలిపారు. ఇంటర్ ఫలితాల్లో టాపర్లుగా నిలిచిన ఈ చిన్నారులు భవిష్యత్తుల్లో ఉన్నత హోదాల్లో స్థిరపడి వారివారి తల్లిదండ్రులు, సింగరేణి సంస్థకు గర్వకారణంగా నిలవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఓటూ జిఎం ఎన్. సత్యనారాయణ, గుర్తింపు సంఘం బ్రాంచి సెక్రటరీ బాజీ సైదా, సింగరేణి అధికారుల సంఘం శ్రీరాంపూర్ అధ్యక్షులు కె. వెంకటేశ్వర రెడ్డి, ఆర్కే-ఐదు గ్రూప్ ఏజెంట్ ఎన్. శ్రీధర్, ఆర్కే-5 గని మేనేజర్ సుధీర్ కుమార్, డీజీఎం (పర్సనల్) ఎస్. అనిల్ కుమార్, సీనియర్ ఐటీ ప్రోగ్రామర్ గొల్లాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ ఆర్ పి - 3 గని లోని అపరిష్కృత సమస్యలను వెంటనే పరిష్కరించాలని గుర్తింపు సంఘం ఏఐటీయూసీ నాయకులు

**మంచిర్యాల, 20, ఏప్రిల్ (ప్రజా జ్యోతి):** సింగరేణి గుర్తింపు కార్మిక సంఘం సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) ఆధ్వర్యంలో ఎస్ ఆర్ పి - 3 గనిలో పరిష్కారం కాని అపరిష్కృత సమస్యలను వెంటనే పరిష్కరించాలని గని మేనేజర్‌కు మెమోరాండం అందజేశారు. ఈ కార్యక్ర మానికి ముఖ్య అతిథులుగా హాజరైన యూనియన్ డిప్యూటీ ప్రధాన కార్యదర్శులు కందికట్ల వీరభద్రయ్య, ముస్కే సమ్మయ్య, శ్రీరాంపూర్ బ్రాంచ్ కార్యదర్శి బాజీ సైదాలు మాట్లాడుతూ, ఎస్ ఆర్ పి - 3 యాజమాన్యం



ఉత్పత్తిపై చూపుతున్న శ్రద్ధ కార్మికుల మౌలిక సదుపాయాలు, సమస్యల పరిష్కారంపై లేదని విమర్శించారు. మైన్స్ కమిటీ, సేఫ్టీ కమిటీ సమావేశాల్లో పలుమార్లు సమస్యలను యాజమాన్యం దృష్టికి తీసుకువెళ్లినా పరిష్కారం కాలేదని తెలిపారు. వారు ప్రస్తావించిన ప్రధాన సమస్యల్లో బ్యాంక్ హెడ్ ఖాళీల భర్తీ, లైన్స్ లిఫ్టింగ్, 5 మరియు 6 సీమ్ ట్రాక్‌ల నిర్వహణ, ఎండ్‌లెస్ ట్రాక్‌ల మధ్య గ్యాప్ ఏర్పాటు, ప్రతి జంక్షన్ మరియు హాలేజ్ రోడ్లలో మ్యాన్‌హోల్ ఏర్పాటు, లివర్ హ్యాండిల్ రన్‌వే పాయింట్స్ ఏర్పాటు వంటి భద్రతా చర్యలు ఉన్నాయి. అలాగే గనిలోని అన్ని విభాగాల కార్మికుల షెడ్లను మరమ్మతులు చేయడం, పనిముట్ల కోసం కబోర్డులు ఏర్పాటు, నాణ్యమైన పనిముట్లు, డ్రిల్ రాడ్స్, కోల్ బిట్స్ సరఫరా, సపోర్ట్ మెన్స్‌కు అవసరమైన మెటీరియల్ అందించాలని కోరారు. అదేవిధంగా గుట్కాల సరఫరా, వర్షాకాలంలో అవి తడవకుండా షెడ్ల మరమ్మతులు, ప్రతి డిస్ట్రిక్ట్‌లో లాడర్లు ఏర్పాటు, సులభ్ కాంప్లెక్స్ డోర్ల మరమ్మతులు వంటి సౌకర్యాలను కల్పించాలని కోరారు. సమస్యలు వెంటనే పరిష్కరించకపోతే ఆందోళన కార్యక్రమాలను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఫిట్ కార్యదర్శి మురళి చౌదరి, కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రీజియన్ కార్యదర్శి అఫ్రోజ్ ఖాన్, ఫిట్ ఉపాధ్యక్షుడు తవటం మల్లేష్, సహాయ కార్యదర్శి అంబల రవి, నాయకులు కారుకూరి నగేష్, రవి, సారయ్య, సాయిబాబా, గోపి తదితరులు పాల్గొన్నారు.

## డ్రైనేజ్ సమస్యలపై చైర్‌పర్సన్ సంధ్యారాణి పరిశీలన



**రామకృష్ణాపూర్, ఏప్రిల్ 20 (ప్రజా జ్యోతి):** క్యాతనపల్లి మున్సిపాలిటీ 17వ వార్డు విద్యానగర్ ప్రాంతంలో మెయిన్ స్ట్రీమ్ డ్రైన్‌ను మున్సిపల్ చైర్‌పర్సన్ డాక్టర్ గొడిసెల సంధ్యారాణి రాజారమేష్ పరిశీలించారు. గతంలో కాలువ మునిగి ఇండ్లలోకి మురికి నీరు చేరడంతో ప్రజలు ఎదుర్కొన్న ఇబ్బందులను స్థాని కులు ఆమె దృష్టికి తీసుకువచ్చారు. రానున్న వర్షాకాలం ముందు జాగ్రత్తగా మున్సిపాలిటీ ఏఈ ఆశ్రిత్‌తో కలిసి డ్రైన్ పరిస్థితిని పరిశీలించిన చైర్‌పర్సన్, వెంటనే పూడిక తొలగింపు పనులు చేపట్టి, ప్రత్యేక నిధులతో కొత్త డ్రైన్ నిర్మాణం చేపడతామని హామీ ఇచ్చారు. అన్ని వార్డుల్లో డ్రైనేజీ వ్యవస్థను పరిశీలించి వర్షాకాలంలో సమస్యలు లేకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ రామిడి ఉమాదేవి కుమార్, మోగిలి, లక్ష్మి, సునీత, యూత్ నాయకుడు రామిడి లక్ష్మీకాంత్ తదితరులు, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

## మంచిర్యాల గురుకులంలో 'కెరీర్ కౌన్సెలింగ్' కార్యక్రమం

ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళిక 'సంక్షేమ వారోత్సవం'లో భాగంగా నిర్వహణ

సీపీజీఈటీ, సీయూఈటీ, కెరీర్ మిత్రపై విద్యార్థినులకు అవగాహన



**మంచిర్యాల, 20, ఏప్రిల్ (ప్రజా జ్యోతి):** ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళిక కార్యక్రమం మొదటి రోజులో భాగంగా 'సంక్షేమ వారోత్సవం' ఇతివృత్తం కింద మంచిర్యాల జిల్లాలోని సాంఘిక సంక్షేమ మహిళా గురుకుల కళాశాలలో సోమవారం సీజీసీ బృందం ఆధ్వర్యంలో వృత్తి మార్గదర్శక కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థిను లకు ఉన్నత విద్యా అవకాశాలు, వృత్తి విద్య కెరీర్ ఎంపికలపై అవగాహన కల్పించారు. వృత్తి ప్రణాళిక, నైపుణ్యాభివృద్ధి, ఉద్యోగ అవకాశాల ప్రాముఖ్యతను వివరించారు. డిగ్రీ అనంతరం ఉన్నత విద్య, ప్రభుత్వ-ప్రైవేట్ ఉద్యోగాలు, వ్యాపార ప్రారంభం అవకాశాలపై దిశానిర్దేశం చేశారు. సీపీజీఈటీ (కామన్ పోస్ట్ గ్రాడ్యుయేట్ ఎంట్రన్స్ టెస్ట్), సీయూఈటీ (కామన్ యూనివర్సిటీ ఎంట్రన్స్ టెస్ట్)లి పరీక్షల ప్రాముఖ్యత, అర్హత ప్రమాణాలు, తయారీ విధానాలపై సమాచారం అందించారు. కెరీర్ మిత్ర వేదిక ద్వారా ఉద్యోగ సమాచారం, ఇంటర్న్‌షిప్ అవకాశాలు, వృత్తి మార్గదర్శక వనరులు పొందే విధానాన్ని వివరించారు. విద్యార్థినులను స్పష్టమైన వృత్తి లక్ష్యాలతో ఉన్నత విద్య వైపు అడుగులు వేయాలని, సానుకూల దృక్పథంతో నిరంతరం నైపుణ్యాలు పెంచుకుంటూ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమం లో ప్రిన్సిపల్ డాక్టర్ ఆర్. పాండురంగ శర్మలి, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ జి. అనూషలి, సీజీసీ సమన్వయకర్త డాక్టర్ బి. సంధ్యారాణి, అదనపు సమన్వయకర్త ఈ. శైలజలి, సభ్యులు ఎం. ప్రణయ, బి. నికిత, ఎస్. మౌనిక, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

## తిర్యాణి ఎస్సైగా పి.సుబ్బారావు బాధ్యతల స్వీకరణ

**శాంతిభద్రతలకు ప్రజలు సహకరించాలి: నూతన ఎస్సై**



**ఆసిఫాబాద్ ఏప్రిల్ 20 ప్రజా జ్యోతి** ఆసిఫాబాద్ జిల్లా తిర్యాణి పోలీస్ స్టేషన్ నూతన ఎస్సైగా పి.సుబ్బారావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. మంచిర్యాల జిల్లా చెన్నూరు నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ సిబ్బంది ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఎస్సై మాట్లాడుతూ.. మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రజలు పోలీసులకు పూర్తిగా సహకరించాలని కోరారు. అనుమానాస్పద ఘటనలు ఏవైనా గమనిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. శాంతిభద్రతల విషయంలో ఎలాంటి రాజీపడబోమని, నేరాలకు పాల్పడిన వారి పై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.కార్యక్రమంలో ఎస్సై లాల్ సింగ్, హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్, మహిళా కానిస్టేబుళ్లు జ్యోతి, మల్లేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

## వేసవిలో నీటి కష్టాలు రానివ్వొద్దు

**మిషన్ భగీరథ కార్యాలయాన్ని ఆకస్మిక తనిఖీ చేసిన కలెక్టర్ హరిత**



**ఆసిఫాబాద్ ఏప్రిల్ 20 ప్రజా జ్యోతి** ఆసిఫాబాద్ జిల్లాలో వేసవి కాలంలో ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని కలెక్టర్ కె.హరిత అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కేంద్రంలోని మిషన్ భగీరథ, పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ కార్యాలయాలను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా హాజరు రిజిస్టర్, రికార్డులను పరిశీలించారు. అధికారులు, సిబ్బంది విధులకు సకాలంలో హాజరై సమయపాలన పాటించాలని సూచించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. వేసవి దృష్ట్యా గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో తాగునీటి సరఫరాలో ఎలాంటి అంతరాయం కలగొద్దని స్పష్టం చేశారు. పైపులైన్ల లీకేజీలు, మోటార్ల మరమ్మతులు, విద్యుత్ సమస్యల వల్ల నీటి సరఫరాకు జాప్యం జరిగితే వెంటనే మరమ్మతులు చేపట్టాలన్నారు. తాగునీరు అందని ఆవాసాలు, కాలనీలను గుర్తించి ట్యాంకర్ల ద్వారా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.మిషన్ భగీరథ నీరు ప్రతి ఇంటికీ చేరేలా పర్యవేక్షించాలని, నీటి నాణ్యతపై ఎప్పటికప్పుడు పరీక్షలు నిర్వహించాలని తెలిపారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను నిర్లక్ష్యం చేయకుండా తక్షణమే స్పందించాలని సూచించారు. నీటి ఎద్దడి నివారణకు కార్యాచరణ ప్రణాళికతో పనిచేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.కార్యక్రమంలో మిషన్ భగీరథ ఈఈ సిద్దిక్, పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఎస్టీపీపీలో భావోద్వేగ వీడ్కోలు భర్గవ్‌కు ఘన సన్మానం

**డిప్యూటీ మేనేజర్‌గా ఎంపిక**

**సేవలను కొనియాడిన అధికారులు**



**జైపూర్ ఏప్రిల్ 20 ప్రజా జ్యోతి** జైపూర్ మండలంలోని సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్ లో సి,అండ్,ఐ విభాగంలో ఈఈగా పనిచేస్తున్న భర్గవ్‌కు సోమవారం ఘనంగా వీడ్కోలు పలికారు పరిపాలనా భవనంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఈడి సిహెచ్. చిరంజీవి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఇటీవల ఎస్టీపీసీలో డిప్యూటీ మేనేజర్‌గా ఎంపికై సంస్థను వీడుతున్న సందర్భంగా ఆయన సేవలను గుర్తిస్తూ ఈ సన్మానం నిర్వహించారు. 2013 డిసెంబరులో ఉద్యోగంలో చేరిన భర్గవ్, దాదాపు 12 సంవత్సరాలు నిబద్ధతతో పనిచేసినట్లు అధికారులు తెలిపారు.అనంతరం సహచరులు ఆయనతో పనిచేసిన అనుభవాలను పంచుకుంటూ, ఆయన లోటు పూడ్చ లేనిదని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో జీఎం,పిసిఎస్, ఓ అండ్ ఎం, ఎం. మదన్మోహన్, సీఎంఓఏఐ బ్రాంచ్ ప్రెసిడెంట్ డి. పంతుల,డీజీఎం సి అండ్ ఐ శివప్రసాద్, డీజీఎం వేణుగోపాల్, డీజీఎం (ఆపరేషన్) సంతోష్ కుమార్, డీజీఎం పర్సనల్ కిరణ్ బాబు,ఎస్ఈ (సివిల్) రాము, డా. జానకి, మేనేజర్ (ఫారెస్ట్) చంద్రమణి తదితరులు పాల్గొన్నారు.

## ఇంటర్ ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన మైనారిటీ విద్యార్థులు

**జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అభినందనలు**



**మంచిర్యాల, 20, ఏప్రిల్ ( ప్రజా జ్యోతి ):** ఇంటర్మీడియట్ ఫలితాల్లో జిల్లా మైనారిటీ పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచారని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం నస్పూర్‌లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి నీరటి రాజేశ్వరి, ఆర్.ఎల్.సి ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లా షగుఫ్తా ఫిర్దౌస్‌లతో కలిసి మైనారిటీ విద్యాసంస్థల విద్యార్థులను ఆయన సన్మానించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, 2025--26 విద్యా సంవత్సరంలో జిల్లాలోని బెల్లంపల్లి, మంచిర్యాల, చెన్నూరు ప్రాంతాల్లోని మైనారిటీ పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు ఇంటర్ ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచారని తెలిపారు. రాష్ట్రస్థాయిలో 2వ స్థానంలో నిలవడం గర్వకారణమన్నారు.విద్యార్థులు భవిష్యత్తులో ఉన్నత విద్యలో మరింత రాణించి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. విద్యార్థుల విజయానికి కృషి చేసిన అధ్యాపకులు, ప్రిన్సిపల్స్ కృషి అభినందనీయమని ఆయన ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో విజిలెన్స్ ఆఫీసర్ తహరుద్దీన్, అకాడమిక్ సమన్వయకర్త రిజ్వాన్, మంచిర్యాల ప్రిన్సిపల్ సంధ్య, బెల్లంపల్లి ప్రిన్సిపల్ ఎం.డి. నీలు తదితరులు పాల్గొన్నారు.

## మే 1 నుంచి పాత్రికేయులకు అక్రిడిటేషన్లు

**25లోగా దరఖాస్తు చేసుకోవాలి: కలెక్టర్ హరిత**



**ఆసిఫాబాద్ ఏప్రిల్ 20 ప్రజా జ్యోతి** ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా ఉంటూ ప్రభుత్వ పథకాలను అర్హులకు చేరవేయడంలో, ప్రజా సమస్యల పరిష్కారంలో కీలక పాత్ర పోషిస్తున్న పాత్రికేయులకు మే 1 నుంచి అక్రిడిటేషన్ కార్డులు జారీ చేయనున్నట్లు జిల్లా కలెక్టర్, అక్రిడిటేషన్ కమిటీ చైర్మన్ కె.హరిత తెలిపారు.ఆదివారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లాలో అర్హత కలిగిన ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా పాత్రికేయులు ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు ఈ నెల 25వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అక్రిడిటేషన్ల జారీకి అవసరమైన చర్యలు చేపట్టామని పేర్కొన్నారు.

## ఉట్నూర్ లో రోడ్డు వెడల్పు పనులకు శ్రీకారం చుట్టిన ఎమ్మెల్యే బొజ్జు పటేల్





**ఉట్నూర్, ఏప్రిల్ 20 (ప్రజాజ్యోతి )** ఉట్నూర్ పట్టణంలోని పాత బస్టాండ్ నుండి ఐబి వెళ్లే రోడ్డును ఇరువైపులా రోడ్డు వెడల్పు పనులకు సోమవారం ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ శ్రీకారం చుట్టారు. ఉట్నూర్ సర్పంచ్ అనిత శ్రీనివాస్ జాదవ్ ఉప సర్పంచ్ అశ్రద్ బేగం అన్సారి నాయకులతో కలిసి ఎమ్మెల్యే పాత బస్టాండ్ నుండి ఏసియన్ బేకరీ వరకు ఉట్నూర్ మేజర్ గ్రామపంచాయతీ నిధుల నుండి 20 లక్షలతో చేపట్టే రోడ్డు వెడల్పు పనులకు భూమి పూజ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉట్నూర్ పంచాయతీరాజ్ డిఇ పవర్ రమేష్ ఉట్నూర్ మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ అనిత శ్రీనివాస్ జాదవ్, ఉట్నూర్ మేజర్ గ్రామపంచాయతీ ఈవో శంకర్ అధికారులతో ఎమ్మెల్యే మాట్లాడుతూ పాత బస్టాండ్ నుండి ఏసియన్ బేకరీ వరకు నిర్మించే రోడ్డు వెడల్ పనులు తోపాటు ఏసియన్ బేకరీ నుండి ఉట్నూర్ ఐబి చౌరస్తా వరకు రోడ్డు వెడల్పు పనులకు తన ఎమ్మెల్యే కోటా నుండి నిధులు మంజూరు చేయిస్తానని అదేవిధంగా పాత బస్టాండ్ నుండి ఐ బి చౌరస్తా వరకు సెంట్రల్ లైటింగ్ ఏర్పాటుకు స్తంభాలు వరుసగా ఉండేలా చూడాలని స్తంభాలకు మార్కింగ్ చేయాలని ఎమ్మెల్యే బొజ్జు పటేల్ కోరారు. ఈ కార్యక్రమంలో ఉట్నూర్ మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ అనిత శ్రీనివాస్ జాదవ్,ఉప సర్పంచ్ అశ్రద్ బేగం అన్సారి, అదిలాబాద్ డిసిసి ప్రధాన కార్యదర్శి సయ్యద్ ఇక్బాల్, జైనూర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బానోత్ జైవంతరావు డిసిసి ఉపాధ్యక్షులు లింగంపల్లి చంద్రయ్య ఆదిలాబాద్ ఆర్టిఏ మెంబర్ దూట రాజేశ్వర్, ఉట్నూర్ పంచాయతీరాజ్ డిఇ పవార్ రమేష్, ఉట్నూర్ పంచాయతీ ఈవో శంకర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, సయ్యద్ నిసార్, కొత్తపెల్లి మహేందర్, బిరుదుల లాజర్, రాజేష్ జాదవ్, అచ్చ దేవానంద్, స్వామి వార్డు సభ్యులు, నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

## నేలమ్మ తల్లికి తొలి పూజ



బాసర ఏప్రిల్ 20 (ప్రజా జ్యోతి) బాసర మండల కేంద్రంలో సోమవారం నేలమ్మ తల్లికి తొలి పూజ నిర్వహించారు రైతన్నలు భూతల్లిని తమ తల్లిగా భావించి ప్రతి సంవత్సరం ఉగాది అనంతరం అక్షయ తృతీయ రోజున నేల్లమ్మ తల్లికి తొలి పూజలు నిర్వహిస్తారు ఈ పూజను రైతులు పిల్లాపాపలతో ఘనంగా నిర్వహించుకుంటారు తమ పంట పొలాలకు వెళ్లి భూతల్లికి పూజలు నిర్వహించి తమ పంట పొలాల లో భోజనాలు చేసి ఆనందంగా గడుపుతారు తమ పంటలు సమృద్ధిగా పండాలని భూతల్లికి పూజలు చేసి తమ మొక్కులను తీర్చుకుంటారు

## ఎగ్ బాల్ పూర్ లో చలివేంద్రం ప్రారంభం



ఖానాపూర్ ఏప్రిల్ 20( ప్రజా జ్యోతి ) వేసవి కాలంలో ప్రజలకు చల్లటి త్రాగునీరు అందించేందుకు జిల్లా కలెక్టర్ ఆదేశం తోఖా నాపూర్‌లోని ఇక్బాల్ పూర్ గ్రామపంచాయతీలో సోమవారం మండల ప్రత్యేక అధికారి సిపిఓ జీవరత్నం సార్ ఎంపీడీవో, రాథోడ్ రాధా ఎంపీఓ చిట్యాల రత్నాకర్ రావు పంచాయతీ కార్యదర్శి, సర్పంచ్ ఉప సర్పంచ్ సమక్షంలో చలివేంద్రాన్ని ప్రారంభించారు వేసవి తాపాన్ని తీర్చేందుకు చలివేంద్రాన్ని ప్రజలు ఉపయోగించుకోవాలని కోరారు

## రోడ్డు ప్రమాద బాధితుడిని పరామర్శించిన,- ఆడే గజేందర్



నేరడిగొండ,ఏప్రిల్ 20 ప్రజాజ్యోతి : రోడ్డు ప్రమాదంలో గాయపడిన బోథ్ బ్లాక్ ఆత్మ డైరెక్టర్ సింగరపు స్వామిని బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ఆడే గజేందర్ పరామర్శించారు. సోమవారం మండలంలోని తేజాపూర్ గ్రామంలో ఉన్న స్వామి నివాసానికి ఆయన వెళ్లారు. ఇటీవల జరిగిన ప్రమాదంలో స్వామి గాయపడ్డారనే విషయం తెలుసుకున్న గజేందర్, నేరుగా ఆయన ఇంటికి వెళ్లి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. క్షతగాత్రునికి ధైర్యం చెబుతూ, మెరుగైన వైద్యం అందేలా చూడాలని కుటుంబ సభ్యులకు సూచించారు. ఈ పరామర్శలో ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఏలేటి మోహన్ రెడ్డి, తల్లా నారాయణ, బద్దం పోతారెడ్డి, ఎండి సద్దాం, వార్డు సభ్యులు రమేష్ రెడ్డి, సుంకు వినోద్ తదితరులు పాల్గొన్నారు.

## ఓటర్ల జాబితా మ్యాపింగ్ వేగవంతం చేయాలి

**బీఎల్ఓలు ఇంటింటికీ వెళ్లి వివరాలు సేకరించాలి: సీఈవో సుదర్శన్ రెడ్డి**




ఆసిఫాబాద్ ఏప్రిల్ 20 ప్రజా జ్యోతి ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో భాగంగా మ్యాపింగ్ ప్రక్రియను వేగంగా పూర్తి చేయాలని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి ఆదేశించారు.సోమవారం హైదరాబాద్‌లోని తన కార్యాలయం నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లు, జిల్లా ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఓటర్ల జాబితాను ఏ, బీ, సీ, డీ కేటగిరీలుగా విభజించి మ్యాపింగ్ ప్రక్రియ చేపట్టాలని స్పష్టం చేశారు. బూత్ స్థాయి అధికారులు, సూపర్‌వైజర్లు ప్రతి ఇంటికీ వెళ్లి ఓటర్ల వివరాలు సేకరించి ధ్రువీకరించాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో సెర్ప్ సిబ్బంది, పట్టణ ప్రాంతాల్లో మెప్మా సిబ్బంది సహకారం తీసుకొని మ్యాపింగ్‌ను పకడ్బందీగా పూర్తి చేయాలన్నారు. మరణించిన వారు, శాశ్వతంగా వలస వెళ్లిన వారి పేర్లను జాబితా నుంచి తొలగించాలని, కొత్తగా 18 ఏళ్లు నిండిన వారిని చేర్చాలని తెలిపారు. ఒకే వ్యక్తికి రెండు చోట్ల ఓటు లేకుండా చూడాలని, ఓటర్ల జాబితా స్వచ్ఛంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. నిర్దేశిత గడువులోగా మ్యాపింగ్ పూర్తి చేసి నివేదికలు సమర్పించాలని ఆదేశించారు. జిల్లాల వారీగా ప్రగతిపై ఎప్పటికప్పుడు సమీక్షిస్తామని పేర్కొన్నారు.


## అడవి పురిటి గడ్డపై అమరత్వపు సంతకం ఇంద్రవెల్లి స్తూపం



నేరడిగొండ ఏప్రిల్ 20( ప్రజాజ్యోతి) నేను ఆతోవ తొక్కు తున్నప్పుడల్లా. ఆ ఇంద్రవెల్లి స్తూపాన్ని, నా కన్ను కెమెరాలు బంధించినప్పుడల్లా.నా మదిలో అప్పుడు చైతన్య పూరిత భావన ఏదో, మెదలాడుతుంటుంది. ఆ ప్రాంతం గతం పోరులోకి నా మనసు దూరినప్పుడల్లా. గిరిజన చైతన్య హక్కుల కెరటం అక్కడ అలలు అలలుగా జనసంద్రమై , వన అరణ్యము నుంచి జన అరణ్యంలోకి ఎగిసిపడుతుంది. ఈ నేల ఉత్తది కాదు కొమరం భీమ్ వీరత్వానికి పురుడుపోసుకున్నది. ఈ తావు వట్టిది కాదు, రాంజీ గోండ్ దాదా తిరుగుబాటు తిరుగుబా టుకే పాఠాలు నేర్పింది. అమరత్వం అంటే మాకు మా నేలకు అమరిన బంధుత్వం. మా ఆదిలాబాద్ అంటే ఆకుపచ్చని అడవులే కాదు. ఆదిమ గిరిజనులే కాదు, అందరు అనుకున్నట్లు ఈ జనం అమాయకులేం కాదు. జల్ జంగల్ జమీన్ కోసం హక్కుల కోసం,? ఎగిసి పడే పోరాటాలు ఏరులై పారిన రక్తం, ఇప్పుడు అడవి అంతా పూస్తున్న ఎర్రని మోదుగవనం. ఇంద్రవెల్లిలో మొలిచిన స్తూపం అమరుల త్యాగానికి అమరత్వానికి నిలువెత్తు సాక్ష్యం. ఆ స్థూపం పెరెత్తితేనే ఒకప్పుడు ఎందరికో భయం. ఆ స్తూపం ఇచ్చిన ప్రేరణ ఎందరికో ఇప్పుడు అభయం. పోరాటాల చరిత్ర ఎప్పుడు ఆ స్థూపాన్ని మరవదు. ఆ పోరాట స్ఫూర్తిని గిరిజనం ఎప్పుడు విడువదు, (తెలుగు రచయిత గడ్డం భీమ్ రెడ్డి,? కుమారి):

## ఇంటి పేరు అక్రమ మార్పిడిపై కలెక్టర్‌కు ఫిర్యాదు

**పంచాయతీ కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలని బాధితుడి వినతి**



ఆసిఫాబాద్ ఏప్రిల్ 20 ప్రజా జ్యోతి నిబంధనలకు విరుద్ధంగా ఇంటి పేరు మార్చిన గ్రామ పంచాయతీ కార్యదర్శి పై చర్యలు తీసుకోవాలని సిర్పూర్ (టి) బజార్ వాడకు చెందిన అబ్దుల్ అహ్మద్ ఖాన్ జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఆయన కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. సిర్పూర్ (టి) బజార్ వాడలో తమ తల్లి రఫిక బేగం పేరిట ఇంటి నెంబర్ 2-72 ఉందని, ఆ ఇంటిని 2025 ఆగష్టు 19 వరకు తమ తల్లి పేరుపైనే ఉంచిన పంచాయతీ కార్యదర్శి మరుసటి రోజే అంటే ఆగష్టు 20న నిబంధనలకు విరుద్ధంగా శాహేనాజ్ బేగం పేరిట మార్చారని ఆరోపించారు.అనంతరం ఆమె ఆగష్టు 28న ప్రొసీడింగ్ నెంబర్ 57/టూ/2025 ఆధారంగా ఇంటిని ఇతరులకు రిజిస్ట్రీ చేశారని తెలిపారు. అక్కడ ఎన్నో ఏళ్లుగా ఇల్లు కూలిపోయి ఉన్నప్పటికీ, గోడలపై సిమెంట్ రేకుల ఇల్లు ఉన్నట్లు చూపి అక్రమ రిజిస్ట్రీ చేయించుకున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు పంచాయతీ కార్యదర్శి ప్రలోభాలకులొంగి ఈ అక్రమాలకు సహకరించారని ఆరోపించారు. కావున 57/ 2025 ప్రొసీడింగ్ ను రద్దు చేసి తిరిగి తమ తల్లి పేరిట ఇంటిని మార్చాలని కలెక్టర్ ను కోరారు. ఫిర్యాదుకు సంబంధించిన పత్రాలను జతచేశామని బాధితుడు తెలిపారు

## కలెక్టరేట్లో ఘనంగా బసవేశ్వర జయంతి వేడుకలు





నిర్మల్ జిల్లా ప్రతినిధి ,ఏప్రిల్ 20 ,( ప్రజాజ్యోతి ). జిల్లా కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో సోమవారం బసవేశ్వర జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ జయంతి వేడుకల్లో జిల్లా అదనపు కలెక్టర్ లు వెంకటేశ్వర్లు, కిషోర్ కుమార్ పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో భాగంగా బసవేశ్వర చిత్రపటానికి అదనపు కలెక్టర్ లు, అధికారులతో కలిసి పూలమాలలు వేసి అంజలి ఘటించారు. ఈ సందర్భంగా పలువురు అధికారులు మాట్లాడుతూ, నాటి కాలంలోనే సమాజంలో అసమానతలను తొలగించి, సమానత్వాన్ని సాధించేందుకు బసవేశ్వర మహారాజ్ ఎంతగానో కృషి చేశారని తెలిపారు. మహిళల హక్కుల కోసం, మహిళ వివక్షత నిర్మూలన కోసం పోరాడిన గొప్ప వ్యక్తి బసవేశ్వర మహారాజ్ అని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ బసవేశ్వర మహారాజ్ అడుగుజాడల్లో నడవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ, మైనారిటీ సంక్షేమ అధికారులు శ్రీనివాస్, మోహన్ సింగ్, పలువురు సంఘాల నాయకులు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారంలో ఆలస్యం చేయకూడదు

**కలెక్టర్ అభిలాష అభినవ్**



**నిర్మల్ జిల్లా ప్రతినిధి ,ఎప్రిల్ 20 ,( ప్రజాజ్యోతి )** ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారంలో ఆలస్యం చేయకూడదని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను ఆమె స్వయంగా స్వీకరించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి, తక్షణమే స్పందించాలని అధికారులకు సూచించారు. మండలాల వారీగా పెండింగ్ లో ఉన్న ప్రజావాణి దరఖాస్తులకు సంబంధించి సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. ప్రజల సమస్యలను సంబంధిత శాఖలు సమన్వయంతో పరిష్కరించేలా పనిచేయాలని సూచించారు. ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా, ప్రజలు విద్య, వైద్యం, ఇందిరమ్మ ఇండ్లు, పింఛన్లు, భూ సమస్యలకు సంబంధించి దరఖాస్తులను కలెక్టర్ కు సమర్పించారు. ప్రజావాణి కార్యక్రమం అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా సంక్షేమ వారోత్సవాలను పకడ్బందీగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ప్రతి అధికారి సంక్షేమ వసతి గృహాల్లో నిర్వహించే సంక్షేమ వారోత్సవాల్లో పాల్గొనాలని తెలిపారు.అనంతరం ఇంటర్నేషనల్ మదర్ ఎర్త్ డే-2026 కు సంబంధించి వారోత్సవాల గోడప్రతులను ఆవిష్కరించారు.ఈ ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లు వెంకటేశ్వర్లు, కిషోర్ కుమార్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## వడ్ల కొనుగోలు ప్రక్రియ వేగవంతం చేయాలి

**అధికారుల తీరుపై ఎమ్మెల్యే ఆగ్రహం**



**లోకేశ్వరం ఏప్రిల్ 20 ప్రజా జ్యోతి )** ఆరుగాలం శ్రమించి పండించిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయకపోతే రైతులు నష్టపోతారని ముధోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్ అన్నారు సోమవారం రోజున కనకాపూర్ అబ్దుల్లాపూర్ గ్రామాలలో వడ్ల కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాలు ప్రారంభించిన మాత్రాన రైతులకు లాభం లేదని వెంటనే తూకం వేసే విధంగా చర్యలు తీసుకొని అందుబాటులో లారీలను సంచులను వెంటవెంటనే తెప్పించుకోవాలని ఆయన అన్నారు గత సీజన్లో ప్రారంభించిన 20 రోజులకు కొనుగోలు ప్రక్రియను మొదలు పెట్టడంతో రైతులు ఎమ్మెల్యేను ప్రశ్నించారు వెంటనే ఎమ్మెల్యే జోక్యం చేసుకొని జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారులను ఫోన్లో మాట్లాడుతూ ఈదురు గాలుల బీభత్సం వడగండ్ల వాన కురుస్తున్న నేపథ్యంలో రైతులు నష్టపోతారని వెంటనే కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు లేనియెడల నేనే స్వయంగా రైతులతో ఎర్లీ ఎక్స్ రోడ్డు పైన నేషనల్ హైవేను నిలిపివేస్తానని ఆయన హెచ్చరించారు నేను ఎల్లప్పుడూ రైతులతో ఉంటానని రైతుల కష్టం ఏ విధంగా ఉంటదో నేను స్వయంగా చూశానని నేను ఒక రైతు బిడ్డ నేనని ఆయన అన్నారు కార్యక్రమంలో సర్పంచులు దడిగే జయలలిత భోజన్న సునీల్ కుమార్ దయానంద్ ఆత్మ చైర్మన్ నర్సారెడ్డి బిజెపి మండల అధ్యక్షుడు సాయన్న బిజెపి సీనియర్ నాయకులు శ్రీధర్ లిఫ్టి ఇరిగేషన్ చైర్మన్ కట్ట రాజారెడ్డి రాజశేఖర్ గ్రామ వి డి సి చైర్మన్ గంగాధర్ సెక్రెటరీ సాయిరెడ్డి ఏపీఎం ఐకెపి అధ్యక్షురాలు మహిళలు రైతులు పాల్గొన్నారు

## బాసర క్షేత్రం లో భక్తులతో కిటకిటలాడిన ఆలయం

**అక్షయ తృతీయ అక్షరాభ్యాస సందడి**



**బాసర ఏప్రిల్ 20(ప్రజా జ్యోతి) :** చదువుల తల్లి కొలువైన బాసర శ్రీ జ్ఞాన సరస్వతి దేవి అమ్మవారి సన్నిధిలో సోమవారం అక్షయ తృతీయ పర్వదినాన్ని పురస్కరించుకొని అమ్మవారి సన్నిధిలో అక్షరాభ్యాస సందడి నెలకొంది. తెలుగు రాష్ట్రాల నుండి కాక మహారాష్ట్ర నుంచి వచ్చిన వేలాది మంది భక్తులు గోదావరి నదిలో పుణ్యస్నానాలు ఆచరించారు నది తీరాన గల శివాలయంలో ప్రత్యేక అభిషేక అర్చన పూజలు నిర్వహించారు.అనంతరం భక్తులు చిన్నారులు అమ్మవారి అక్షరాభ్యాస దర్శన క్యూ లైన్ లో బారులు తీరారు. అక్షయ తృతీయ శుభ ముహూర్తాన్ని పురస్కరించుకొని అమ్మవారి చెంత ఆలయ అర్చకులచే భక్తుల తమ చిన్నారులకు అక్షరాభ్యాస పూజలు ఘనంగా జరిపించారు. అనంతరం భక్తులు చిన్నారులు ఆలయంలోని అమ్మవార్లను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ప్రత్యేక అక్షరాభ్యాసానికి ఒక్కో బ్యాచుకు గంటకు పైగా సమయం పట్టింది.సాధారణ ప్రత్యేక అక్షరాభ్యాసాలు 720 వరకు జరిగాయని అధికారులు తెలిపారు. క్యూలైన్లో అక్షరాభ్యాస పూజలో వేచి ఉన్న భక్తులకు దాతల తరఫున త్రాగునీరు, కోకోనట్ వాటర్ అందించారు. అమ్మవారి అన్నదాన సత్రంలో భక్తులు అమ్మవారి ప్రసాదాన్ని స్వీకరించారు. భక్తుల రద్దీకి అనుగుణంగా ఆలయ అధికారులు ఏర్పాట్లు చేశారు. ఆర్జిత సేవలు ప్రసాదాల అమ్మకాలు అక్షరాభ్యాస పూజల ద్వారా 15 లక్షల వరకు ఆలయానికి ఆదాయం సమకూరినట్లు ఆలయ అధికారులు తెలిపారు సుమారు పదివేల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు అధికారులు పేర్కొన్నారు.

## కాంగ్రెస్ కార్యదర్శి అగ్గు రమేష్‌ని సన్మానించిన - ఏలేటి అశ్విన్ రెడ్డి



**నేరడిగొండ, ఏప్రిల్ 20 (ప్రజాజ్యోతి):** ఆదిలాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ నూతన కార్యదర్శిగా ఎన్నికైన అగ్గు రమేష్‌ను సోమవారం జిల్లా సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఏలేటి అశ్విన్ రెడ్డి ఘనంగా సన్మానించారు. నేరడిగొండలోని తన క్యాంప్ కార్యాలయంలో అగ్గు రమేష్‌కు పుష్పగుచ్ఛం అందజేసి, శాలువా తో సత్కరించారు. ఈ సందర్భంగా ఏలేటి అశ్విన్ రెడ్డి మాట్లాడు తూ.. పార్టీ నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ, ఆదిలాబాద్ జిల్లాలో కాంగ్రెస్ బలోపేతానికి అగ్గు రమేష్ శక్తివంచన లేకుండా కృషి చేయాలని ఆకాంక్షించారు. కార్యకర్తలను సమన్వయం చేసుకుం టూ పార్టీ అభివృద్ధి పథంలో నడవాలని ఆయన సూచించారు.ఈ సన్మాన కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ ముఖ్య నాయకులు పాల్గొన్నారు. వారిలోబోథ్ వైస్ ఎంపీపీ లింబాజీ,మాజీ ఉపసర్పం చ్ నరేష్ రెడ్డి, ఉట్నూర్ రామలక్ష్మణ గౌడ్, మనోజ్ రెడ్డి,కిషన్ పటేల్ మరియు ఇతర కాంగ్రెస్ శ్రేణులు పాల్గొన్నారు.

# అగ్నిమాపక వారోత్సవాల పోస్టర్లను విడుదల చేసిన ఎమ్మెల్యే

**ముగిసిన అగ్నిమాపక వారోత్సవాలు**

**ఉట్నూర్ ఏప్రిల్ 20 (ప్రజాజ్యోతి )** ముంబైలో 1944 ఏప్రిల్ 14న విక్టోరియా డాగ్ యార్డ్లో ఒక నౌకకు జరిగిన అగ్నిప్రమాదంలో విధి నిర్వహణలో అసువులు బాసిన 66 మంది అగ్నిమాపక గల సిబ్బంది స్మారకార్థం ప్రతి ఏడాది నిర్వహించే ఏప్రిల్ 14 నుండి 20 వరకు నిర్వహించే అగ్నిమాపక వారోత్సవాలు సోమవారం ముగిశాయి. ముగింపు వేడుకలు సందర్భంగా ఖానాపూర్ ఎమ్మెల్యే బొజ్జు పటేల్ ఉట్నూర్ లో అగ్నిమాపక వారోత్సవాల పోస్టర్లను విడుదల చేశారు. ఈ వారో త్సవాల సందర్భంగా ఉట్నూర్ అగ్నిమాపక కేంద్ర అధికారి ఎంఏ మొబీన్, అగ్నిమాపక ఉద్యోగులు బి రమాకాంత్ జై అనిల్ కే వేణు అజయ్ కుమార్ రవీందర్ ఆంజనేయులు వీరేందర్ విగ్నేశ్వర్ లు అగ్నిమాపక అధికారుల మృతి పట్ల రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళు లర్పించారు. ఈ ముగింపు వేడుకల్లో ఉట్నూర్ మేజర్



గ్రామపంచాయతీ సర్పంచ్ అనిత శ్రీనివాస్ యాదవ్ ఉప సర్పంచ్ అర్షద్ బేగం అన్సారి, ఆదిలాబాద్ డిసిసి జిల్లా ప్రధాన కార్యదర్శి ఇక్బాల్, డిసిసిజిల్లా ఉపాధ్యక్షులు లింగంపల్లి చంద్రయ్య ఆదిలాబాద్ ఆర్టీఏ మెంబర్ దూట రాజేశ్వర్, జై నూర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బానోత్ జై వంతరావు, పార్టీల నాయకులు ఉద్యోగులు ప్రజలు పాల్గొన్నారు.

# ప్రభుత్వ బడుల్లో చదివే విద్యార్థుల నైపుణ్యాల మెరుగుదల లక్ష్యంగా విద్య బోధన సాగాలి

### "ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక" సంక్షేమ వారోత్సవాలను విజయవంతంగా కొనసాగించాలి

### జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

**నిర్మల్ జిల్లా ప్రతినిధి ,ఎప్రిల్ 20 ,( ప్రజాజ్యోతి ).** ప్రభుత్వ బడుల్లో చదివే విద్యార్థుల నైపుణ్యాలు పెరిగేలా విద్యా బోధన చేయాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. సోమవారం జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్, రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన "ప్రజా పాలన– ప్రగతి ప్రణాళిక" సంక్షేమ వారోత్సవాల్లో భాగంగా, సారంగాపూర్ మండలంలోని స్వర్ణ గ్రామంలో గల ప్రభుత్వ బాలికల ఆశ్రమ పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ పాఠశాలలోని వంటగదిని పరిశీలించారు. వంటగదిని పరిశుభ్రంగా ఉంచుకోవాలని అన్నారు. ప్రతిరోజు విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన ఆహారం అందించాలన్నారు. స్టోర్ రూమ్ తనిఖీ చేశారు. ఫుడ్ కమిటీలో సభ్యులుగా ఉన్న విద్యార్థులతో కలెక్టర్ మాట్లాడుతూ, వారికి అందిస్తున్న భోజనం వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆహార పదార్థాల ముడిసరుకుల గడువు వివరాలు పరిశీలించారు. స్టాక్ రిజిస్టర్లు తనిఖీ చేశారు. ఆహార పదార్థాల గడువు తేదీ రిజిస్టర్లలో తప్పనిసరి నమోదు చేసి, ఎప్పటికప్పుడు పరిశీలించు కుంటూ ఉండాలన్నారు.తరగతి గదిలో విద్యార్థులతో కలెక్టర్ మాట్లాడారు. వారికి అందుతున్న విద్య గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. వారితో పాఠాలు చదివించారు. క్రమశిక్షణ తో చదువుకుంటూ ఉన్నత శిఖరాలు చేరుకోవాలని ఆకాంక్షించారు. ప్రతి విషయంలో ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలన్నారు. "ప్రజాపాలన–ప్రగతి ప్రణాళిక" లో భాగంగా వసతి గృహాల్లో సంక్షేమ వారోత్సవాలు సమర్థవంతంగా చేపట్టాలని వివరించారు.



అవసరమైన చిన్న చిన్న రిపేర్లకు సంబంధించిన పనులు చేపట్టాలని పేర్కొన్నారు. పాఠశాల ప్రాంగణాన్ని నిరంతరం పరిశుభ్రంగా ఉంచుకోవాలని అన్నారు.అనంతరం గ్రామంలోని లబ్ధిదారురాలు సుల్తానా కు మంజూరైన ఇందిరమ్మ ఇంటిని పరిశీలించారు. ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి సంబంధించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇందిరమ్మ ఇంటి నిర్మాణం పూర్తి చేసుకున్నందున లబ్ధిదారు కుటుంబ సభ్యులకు కలెక్టర్ శుభాకాంక్షలు తెలిపారు. తన కు ఇందిరమ్మ ఇంటిని కట్టించినందుకు ప్రభుత్వానికి లబ్ధిదారురాలు కృతజ్ఞతలు తెలిపారు. తన సొంత ఇంటి కల నెరవేరిందని ఆనందం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో డీఈవో భోజన్న, డిటిడిఓ అంబాజీ, తహసిల్దార్ సంధ్యారాణి, ఎంపీడీవో లక్ష్మికాంత రావు, ఎంపీఓ అజీజ్ ఖాన్, గ్రామ సర్పంచ్ మల్లేష్, ఇతర అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# బాధితుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా గ్రీవెన్స్ డే కార్యక్రమం

### గ్రీవెన్స్ డే ద్వారా ప్రజా సమస్యలకు పారదర్శకంగా తక్షణ పరిష్కారం

### జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రజా ఫిర్యాదులు స్వీకరించిన జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల

**నిర్మల్ జిల్లా ప్రతినిధి ,ఎప్రిల్ 20 ,( ప్రజాజ్యోతి )** నిర్మల్ జిల్లా పోలీసు ముఖ్య కార్యాలయం నందు నిర్వహించిన గ్రీవెన్స్ డే కార్యక్రమానికి నిర్మల్ డివిజన్ పరిధిలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి ఫిర్యాదులు స్వీకరించి వెంటనే పిర్యాదు దారుల ముందే సంబంధిత పోలీస్ స్టేషన్ల అధికారులకు ఫోన్ల ద్వారా బాధితులకు చట్టపరంగా అందాల్సిన సహాయాన్ని అందిస్తూ వారి సమస్యలను పరిష్కరించాలని జిల్లా ఎస్పీ ఆదేశించారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతు ప్రజలకు పోలీస్ సేవలు మరింత చేరువ చేయడమే లక్ష్యంగా, ప్రజా సమస్యలు పరిష్కరించే విధంగా కృషి చేయడం జరుగుతుందని, పోలీస్ అధికారులు, సిబ్బంది పోలీస్ స్టేషన్ కి వచ్చిన ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా ప్రవర్తించి, వినతులు, ఫిర్యాదులు స్వీకరించి, అవసరమైతే క్షేత్ర స్థాయిలో పరిశీలించి చట్ట ప్రకారం బాధితులకు న్యాయం జరిగే విధంగా చూడాలన్నారు. తద్వారా ఫిర్యాదుదారునికి పోలీస్ శాఖపై భరోసా, నమ్మకం కలుగుతుందన్నారు. గ్రీవెన్స్ డే లో వచ్చిన ఫిర్యాదులు ఆన్ లైన్ లో పొందుపరుస్తూ ఏ మేరకు పరిష్కారం అయ్యాయో అని ఎప్పటికప్పుడు సమీక్షించుకుంటూ ప్రజలకు మరింత సమర్థవంతంగా సేవలందించడం జరుగుతుందని అన్నారు.



గ్రీవెన్స్ డే ద్వారా ప్రజలు నేరుగా వారి సమస్యలను మా దృష్టికి తీసుకురావడం ద్వారా సాధ్యమైనంత త్వరగా వాటిని పరిష్కరించేలా చూస్తామని ఎస్పీ తెలిపారు.గ్రీవెన్స్ డేలో వచ్చిన ప్రతి ఫిర్యాదు పైన సంబంధిత పోలీసు స్టేషన్ అధికారులకు వెంటనే ఆదేశాలు జారీ చేసి, ఫాలోఅప్ చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.సమస్యల పరిష్కారంలో ఆలస్యం జరగకుండా పర్యవేక్షణ చేస్తామని హామీ ఇచ్చారు. బాధితులకు సత్వర న్యాయం జరిగేలా పారదర్శక విధానంలో చర్యలు తీసుకోవడమే మా ప్రధాన లక్ష్యం అని జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల పేర్కొన్నారు.

## దంతన్ పల్లిలో ఘనంగా గర్భిణీలకు 'శ్రీమంతం' వేడుక

**పోషణ పక్వాడ కార్యక్రమం**



**ఉట్నూర్ , ఏప్రిల్ 20 (ప్రజాజ్యోతి )**మండలంలోని దంతన్ పల్లి గ్రామంలో ఐసిడిఎస్ ఆధ్వర్యంలో సోమవారం 'పోషణ పక్వాడ' కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా గర్భిణీ స్త్రీలకు ఘనంగా శ్రీమంతం వేడుక నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దంతనపల్లి సర్పంచ్ అంకవ్వ, ఉప సర్పంచ్ మహమ్మద్ మోబీన్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉప సర్పంచ్ ముబీన్ మాట్లాడుతూ.., గర్భిణీలు, బాలింతలు పోషకాహారం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని కోరారు.ఆరోగ్యవంతమైన శిశువుల జననం కోసం ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారాన్నిసద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.సంప్రదాయబద్ధంగా గర్భిణీలకు గాజులు వేసి, పండ్లు, పూలుసమర్పించిఆశీర్వదించారు.గర్భిణీ సమయం లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు పోషకాహార విలువలను అంగన్వాడీ టీచర్ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కార్యక్రమంలో అంగన్వాడీ కేంద్రంలో చదువుతున్న పిల్లలకు ప్రోగ్రెస్ కార్డులు పంపిణీ చేశారు. ఈ వేడుకలో ఐసిడిఎస్ సూపర్వైజర్ జాదవ్ విజయ,స్థానిక అంగన్వాడీ టీచర్ రేవతి, మిగతా అంగన్వాడి కేంద్రాల టీచర్లు, ఆశా వర్కర్లు, గ్రామ పెద్దలు,గర్భిణీలు, మహిళలు పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కార దిశగా అధికారులు పనిచేయాలి

**ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్**



**ఉట్నూరు ఏప్రిల్ 20 (ప్రజాజ్యోతి )** సమస్యల పరిష్కార దిశగా అధికారులు పనిచేయాలని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. ఆయన సోమవారం ఉట్నూరులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. పలు అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్షించారు అదేవిధంగా మండలంలోని కుమ్మరి కుంట బీరుసాయిపేట్ దంతం పెళ్లి కొత్తగూడ దొంగ చింత పంచాయతిలో ప్రభుత్వం మంజూరు చేసిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో అటవీశాఖ అధికారులు చేస్తున్న ఇబ్బందుల గురించి అధికారులతో చర్చించారు. అటవీ శాఖ అధికారుల సమస్య పరిష్కార దిశగా అధికారులు పని చేయాలని కోరారు. కులం గిరిజనులకు మంజూరైన ఇందిరమ్మఇండ్ల నిర్మాణ పనులు పూర్తి చేసేలా తగు చర్యలు తీసుకుంటున్న ట్లు ఈ విషయం లో ప్రభుత్వం కూడా సంసిద్ధత వ్యక్తం చేసిందని గృహాల నిర్మాణ పనులు ఆగకుండా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులకు సూచించారు. జిల్లా ఇన్చార్జి మంత్రి తో పర్యటన చేయిస్తానని, గిరిజన గ్రామాల్లోమండలంలో సమస్యలు తదిత అంశాలపై అధికారులతో సమీక్షించారు. ఈ సమావేశంలో ఎంపీడీవో రాంప్రసాద్, తాసిల్దార్ కోట్నాక్ రఘు నాథ్ రావు, మండల పంచాయతీ అధికారి సుధీర్ రెడ్డి, హౌసింగ్ శాఖ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

## ఎండల తీవ్రత నేపథ్యంలో ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలి

జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల

నిర్మల్ జిల్లా ప్రతినిధి ,ఎప్రిల్ 20 ,( ప్రజాజ్యోతి ). జిల్లాలో ఎండల తీవ్రత అధికంగా కొనసాగుతున్న నేపథ్యం లో, రాబోయే 3–4 రోజులు ఉష్ణోగ్రతలు మరింత పెరిగే అవకాశం ఉన్నందున ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల, సూచించారు.అనవసరంగా ప్రజలు బయటకు రావడం తగ్గించాలని, ముఖ్యంగా చిన్నపిల్లలు, వృద్ధులు మరింత జాగ్రత్తలు పాటించాలని తెలిపారు.అత్యవసర పరిస్థితుల్లో బయటకు వెళ్ళాల్సి వచ్చినప్పుడు తప్పనిసరిగా వాటర్ బాటిల్స్, మజ్జిగ, ఓఆర్ఎస్ వంటి ద్రవ పదార్థాలను వెంట తీసుకెళ్లాలని సూచించారు. అదేవిధంగా బయటకు వెళ్ళేటప్పుడు తలపై క్యాప్ పెట్టుకోవాలని శరీరం నీరసం (డీహైడ్రేషన్) కాకుండా చూసుకోవాలని మధ్యాహ్న వేళల్లో ఎండలో ఎక్కువసేపు ఉండకుండా చూసుకోవడం వంటి జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. ప్రజల ఆరోగ్యం దృష్ట్యా ఈ సూచనలు పాటించడం అత్యంత అవసరమని జిల్లా ఎస్పీ పేర్కొన్నారు.ఇకపోతే, దొంగలతో అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ పరిస్థితులను దొంగలు అవకాశంగా మలచుకునే అవకాశం ఉన్నందున ప్రజలు తమ ఇళ్ల వద్ద, పరిసర ప్రాంతాల్లో అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద వ్యక్తులు గమనించిన వెంటనే సమీప పోలీసులకు సమాచారం ఇవ్వాలని జిల్లా ఎస్పీ డా.జి. జానకి షర్మిల, సూచించారు.



## రైతుల పంటను తక్షణమే కొనుగోళ్లు చేపట్టాలి

సెంటర్లు ప్రారంభించాక ఇబ్బందులెందుకు?

రైస్ మిల్లర్లు నాటకాలు చేస్తే ఊరుకునేది లేదు

కోత పేరుతో రైతులను వేధిస్తే రైతుల తో కలిసి రాస్తారోకో చేస్తా

పది సంవత్సరాలు దోచుకున్నది చాలాలేదా

దోపిడీ కావద్దనే ఐకేపీ ద్వారా కొనుగోళ్లు

అధికారులను హెచ్చరించిన ఎమ్మెల్యే రామరావ్ పటేల్



బాసర ఏప్రిల్ 20 (ప్రజా జ్యోతి) ధాన్యం కొనుగోళ్ల విషయంలో రైతులను ఇబ్బందులు పెడితే సహించేది లేదని కొనుగోలు ప్రారంభించాక సౌకర్యాల లేమి పేరుతో కొనుగోలు ఎందుకు ఆపుతున్నరంటు అధికారుల తీరుపై ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. లోకేశ్వరం మండలంలోని అబ్దుల్లాపూర్ గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించగా, రైతుల పలు సమస్యలు విన్నవించడంతో అధికారులతో ఫోన్లో మాట్లాడారు. ట్రాన్స్ పోర్ట్ ప్రాబ్లమ్ ఉందని, సంచులు లేవని జాప్యం చేస్తే ఊరుకునే ప్రసక్తే లేదని హెచ్చరించారు. గతంలో 10 సంవత్సరాల పాలనలో కొనుగోలు కేంద్రాల ద్వారా అనేక దోపిడీ జరిగిందని, రైస్ మిల్లర్లు దోచుకున్నారని, ఇక కోత పేరుతో వేధిస్తే ఊరుకునేదే లేదని, రైస్ మిల్లర్ల నాటకాలు ఇక చెల్లవన్నారు.

## భైంసా ఏఎస్పీ రాజేష్ మీనా కు ఘన వీడ్కోలు




నిర్మల్ జిల్లా ప్రతినిధి ,ఏప్రిల్ 20 ,( ప్రజాజ్యోతి )భైంసా ఏ ఎస్పీగా విధులు నిర్వర్తిస్తున్న రాజేష్ మీనా, అడిషనల్ ఎస్పీగా పదోన్నతి పొంది వనపర్తి జిల్లాకు బదిలీ అయిన సందర్భంగా ఈరోజు జిల్లా పోలీసు కార్యాలయంలో,జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల, అభినందనలు తెలిపారు.ఈ సందర్భంగా అడిషనల్ ఎస్పీగా పదోన్నతి పొందిన రాజేష్ మీనా, ఐపీఎస్ కు,జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల, సింహ తలాట చిహ్నాన్ని అలంకరించి అభినందనలు తెలిపారు. అనంతరం జిల్లా పోలీసు అధికారులు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ వీడుకోలు సమావేశంలో జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల తో పాటు అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) ఉపేందర్ రెడ్డి, భైంసా ఏఎస్పీ రాజేష్ మీనా ,ఇన్స్పెక్టర్లు, ఆర్.ఐ లు,ఎస్.ఐ లు, ఆర్.ఎస్.ఐ లు ఉన్నారు.

## దివ్యాంగుల సమస్యలు వెంటనే పరిష్కరించాలి

ఆర్ , వి పి డిమాండ్




ఆదిలాబాద్ బ్యూరో, ఎప్రిల్ 20, (ప్రజా జ్యోతి) దివ్యాంగులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆర్ వి పార్టీ రాష్ట్ర అధ్యక్షులు ఇసాక్ అలీ డిమాండ్ చేశారు. ఈ సందర్భం గా సోమవారం ఆదిలాబాద్ ప్రెస్ క్లబ్ లో ఆయన మాట్లా డుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎన్ని కలలో దివ్యాంగులకు ఇచ్చిన హామీల ప్రకారం 6 వేల పెన్షన్, ఉచిత బస్ ప్రయాణ సౌకర్యం కల్పించాలన్నారు. 2016 వికలాంగుల హక్కుల చట్టం పై అధికారులకు, దివ్యాంగులకు అవగాహనా కార్యక్రమాలు ఏర్పాట్లు చేసి దివ్యాంగుల హక్కులు కాపాడాలన్నారు. స్త్రీ సంక్షేమ శాఖ నుంచి వికలాంగుల శాఖ వేరు చేసి దివ్యాం గులకు న్యాయం చేయాలన్నారు. గ్రామీణ ప్రాంత దివ్యాంగులకు సైతం వారి పెన్షన్ బ్యాంకుల్లో జమ అయ్యేలా చూడాలన్నారు. చేయూత పథకం కింద ఇస్తున్న కొత్త పెన్ష న్స్ వికలాంగులకు వెంటనే విడుదల చేయాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని శాఖల్లో ఖాళీ గా ఉన్న బ్యాక్ లాగ్ పోస్టులు వెంటనే భర్తీ చేయాలన్నారు. కాంట్రాక్టు, అవుట్ సోర్స్ పో స్టుల్లో దివ్యాంగులకు 5% రిజర్వేషన్ పాటించాలన్నారు. అ నంతరం ఇందిరమ్మ ఇండ్లలలో దివ్యాంగులకు 5% ఇండ్లు ఇవ్వాలన్నారు. అర్హులైన వారందరికీ రెట్రో ఫిట్టెడ్ వాహనా లు ఇవ్వాలన్నారు. రాష్ట్రీయ వికలాంగ్ పార్టీ అడిగిన డి మాండ్స్ ల పై వెంటనే చర్య లు తీసుకోవాలన్నారు లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉ ద్యమాలు చేసి వారి హక్కుల ను సాధించుకుంటామని పిలు పు నిచ్చారు. ఇందులో మొ హమ్మద్ ఇమ్రాన్, ఫైసల్ అ హ్మద్, శివ కుమార్ నిర్మల్ జిల్లా ఇంచార్జి పాల్గొన్నారు.

## మునిపెల్లిలో ఉపాది హామి పనులు ప్రారంభం



లక్ష్మణ చాంద, ఏప్రిల్ 20 (ప్రజా జ్యోతి) మండలంలోని మునిపెల్లి గ్రామంలో 2026 –27 ఆర్థిక సంవత్సరానికి సంబందించిన ఉపాది హామి పనులను సోమవారం రోజున ప్రారంభించారు. స్తానిక చెరువులో పూడిక తీత పనులను ఉపాది హామి పథకం క్రింద చేపట్టనున్నారు. ఈ కార్యక్రమంలో స్తానిక సర్పంచ్ మేడిపెల్లి సునీత,ఉపసర్పంచ్ రంజిత్ రెడ్డి,మాజి సర్పంచ్ మేడిపెల్లి గంగాధర్,పంచాయతీ కార్యద ర్శి అరుణ,ఈజియస్ సిబ్బంది ఉపాది హామి కూలీలులు పాల్గొన్నారు.

## నూతన పదవి బాధ్యతలు చేపట్టిన వ్యవసాయ అధికారి కి సన్మానం

లక్ష్మణ చాంద, ఏప్రిల్ 20 (ప్రజా జ్యోతి) మండలంలో నూతన వ్యవసాయ అధికారిగా బదిలీపై వచ్చిన నాగరాజును సోమ వారం రోజున కాంగ్రెస్ నాయకులు వారిని మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం రైతు భరోసా రెండవ విడత నిధులను రైతుల బ్యాంకుల ఖాతాలలో జమ చేసే కార్యక్రమాన్ని ప్రత్యక్ష ప్రసారం ద్వారా రైతులతో అధికారులతో కలిసి వీక్షించారు.ఈ కార్యక్రమంలో నిర్మల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షులు ఈటెల శ్రీనివాస్,ఆత్మ కమిటీ డైరెక్టర్ సమ్మెట రవి, యూత్ కాంగ్రెస్ నాయకులు బిట్లింగ్ రజనీకాంత్, ఏ ఈ ఓ లు పవిత్ర, సుస్మిత మరియు రైతుల పాల్గొన్నారు.

## ఓటరు ప్రోజెని మ్యాపింగ్ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చే యాలి

అదనపు కలెక్టర్ చిత్రు



ఆదిలాబాద్ బ్యూరో, ఎప్రిల్ 20,( ప్రజా జ్యోతి) ఓటరు ప్రోజెని మ్యాపింగ్ ప్రక్రి యను వేగవంతంగా పూర్తి చే యాలని అదనపు కలెక్టర్ రాయి సిడాం చిత్రు సంబంధి త అధికారులను ఆదేశించారు.సోమవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫ రెన్స్ హాల్ నుండి రాష్ట్ర ఎన్ని కల ప్రధాన అధికారి సుదర్శన్ రెడ్డి ఆధ్వర్యంలో, ఎస్ఐఆర్ ప్రక్రియకు సంబంధించిన ఓట రు మ్యాపింగ్‌పై అన్ని జిల్లాల కలెక్టర్లతో నిర్వహించిన వీడి యో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ పాల్గొన్నారు.వీడియో కాన్ఫరెన్స్ అనంతరం ఆయన అధికారులతో మాట్లాడుతూ, ఓటరు ప్రోజెని మ్యాపింగ్ ప్రక్రి యలో వేగం పెంచాలని సూ చించారు. బూత్ స్థాయి అధి కారులు (బిఎల్ఓలు) తప్పని సరిగా క్షేత్రస్థాయిలో పర్యటిం చి, ప్రక్రియను సమర్థవంతంగా అమలు చేయాలని తెలిపా రు. నిర్ణీత గడువులోగా ఈ ప్ర క్రియను పూర్తి చేయాలని స్ప ష్టం చేశారు.ఈ వీడియో కాన్ఫ రెన్స్‌లో ఆర్‌డిఓ స్రవంతి, సం బంధిత అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# అమరవీరుల ఆశయ సాధనకు కంకణ భద్దులవుదాం

**అధికారిక స్మరణం- ఆదివా సీల సంబురం**

**45 ఏళ్ల తర్వాత ఇంద్రవెల్లిలో స్వేచ్ఛగా ఘణంగా నివాళి**

**అమరుల త్యాగాలను స్మరించుకున్న నేతలు**







**ఆదిలాబాద్ బ్యూరో, ఎప్రిల్ 20, (ప్రజా జ్యోతి)** జల్, జంగల్, జమీన్ కోసం ఎదురొడ్డి పోరాడి అమరులైన వారి ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కంకణబద్ధులు కా వలసిన అవసరం ఎంతైనా ఉందని పలువురు ఆదివాసి గిరిజన సంఘాల నేతలు, ప్ర జాప్రతినిధులు పిలుపునిచ్చారు. ఇంద్రవెల్లి ఘటనకు 45 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా అమరవీరుల సంస్మరణ సభ సోమవారం ఘణంగా జరుపుకున్నారు. ఇంద్ర వెల్లిలోని అమరవీరుల స్మృ తివనంలో సోమవారం ఘనం గా నిర్వహించిన అమర వీరుల స్మారక వేడుకలు ఆదివాసీ లకు భావోద్వేగ క్షణాలను అం దించాయి. 45 ఏళ్ల తర్వాత స్వేచ్ఛగా అమరులకు నివాళు లర్పించుకునే అవకాశం లభిం చడంతో అధిక సంఖ్యలో గిరి జనులు హాజరై తమ గౌరవా న్ని చాటుకున్నారు. ఈ కార్య క్రమానికి ఖానాపూర్ శాసన సభ్యులు వెడ్మ బొజ్జు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మాజీ ఎంపీ సాయం బాపూరావ్, ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి, ఆసిఫాబాద్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఆత్రం సుగుణ తో కలిసి అమరవీరుల స్తూ పానికి పూజలు నిర్వహించి జెండా ఆవిష్కరించారు. అనంతరం స్తూపానికి పూలమా లలు వేసి అమరులకు ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు సంస్మరణ దినోత్సవం సందర్భంగా అమరుల కుటుంబాలకు అన్ని విధాలుగా సహాయం అందిస్తా మని తెలిపారు. గిరిజనులకు భూ హక్కులు, ఆర్వోఎఫ్ఆర్ ద్వారా కల్పించామని, ఇంది రమ్మ ఇళ్ల మంజూరు, స్మృతి వన అభివృద్ధి కోసం కాంపౌండ్ వాల్, సోలార్ కరెంట్, బోర్ వెల్ వంటి సదుపాయాలు క ల్పించామని చెప్పారు. స్మృతి వనాన్ని రూ.15 లక్షలతో మరింత అభివృద్ధి చేస్తామని హా మీ ఇచ్చారు. ఏజెన్సీ ప్రాంతాల్లో గిరిజనులకు ఇళ్ల సమస్య, త్రీ-ఫేజ్ విద్యుత్, తాగునీటి సమస్యలు లేకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ సమస్యల పరిష్కారానికి ఐటీడీఏ పీవో, అటవీ అధికారులు సమన్వయంతో పని చే యాలని సూచించారు. అనం తరం ప్రభుత్వ ఉపాధ్యాయ డు అత్రంభు జేంద్రరావు రచించిన "ఆ గాయానికి 44 ఏళ్లు" అనే పుస్తకాన్ని ఆవిష్క రించారు. ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ మాట్లా డుతూ గిరిజనులకు అందు తున్న ప్రభుత్వ పథకాలపై అవగాహన పెంపొందించా ల్సిన అవసరం ఉందన్నారు. పోలీస్ మహాసభల ద్వారా ప్రజా సమస్యలను పరిష్కరించే చర్యలు తీసుకుంటామని తెలిపారు. ముఖ్యంగా ఆడ పిల్లల విద్యపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. ఐటీడీఏ పీవో యువరాజ్ మర్మాట్ మా ట్లాడుతూ, స్మృతి వనం అభి వృద్ధి పనులను మూడు నెల ల్లో పూర్తి చేస్తామని తెలిపా రు. గిరిజన గ్రామాల్లో నీటి స మస్యలు ఉన్న ప్రాంతాలను గుర్తించి బోర్ వెల్‌లు లేదా బావులు మంజూరు చేయించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. విద్యార్థులు చదువు మానే యకుండా తల్లిదం డ్రులు చైతన్యం కలిగి ఉండాలని, గ్రామ పటేళు ్ల, సార్మేడి నాయకులు ప్రజలకు అవగా హన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పలు వురు ఆదివాసీ సంఘాల నాయకులు, సార్మేడీలు, పటేళ్లు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# మంత్రి జూపల్లి ఆలోచనలకు కార్యరూపం

**ఆదివాసీల 'విజ్ఞాన యాత్ర'ప్రారంభించనున్న మంత్రి జూపల్లి**

**ఈ నెల 22 న ఉట్నూరులో 'ఆదివాసీ టూరిజం ఎక్స్‌పోజ ర్ ప్రోగ్రామ్'**

**సంస్కృతితో పాటు ఆధునిక తను అవలోకనం చేసేలా కా ర్యక్రమ రూపకల్పన**

**ఆదిలాబాద్ బ్యూరో, ఎప్రిల్ 20, (ప్రజా జ్యోతి)**ఆదివాసీ బిడ్డల అభ్యున్నతే లక్ష్యంగా, వారిలో విజ్ఞాన కాం తులు నింపాలన్న పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూ పల్లి కృష్ణారావు వినూత్న ఆ లోచన ఆచరణ లోకి రానుం ది. గతంలో ఉట్నూరు మండ లం కుమ్మరి కుంటలో పర్య టించిన సందర్భంలో, అక్కడి ఆదివాసీలతో ముచ్చటించిన మంత్రి.. "మిమ్మల్ని హైదరాబా ద్‌కు తీసుకెళ్లి, అక్కడి అభివృ ద్ధిని, చారిత్రక కట్టడాలను చూపిస్తాను" అని హామీ ఇ చ్చారు. తన ఆలోచనల నుం చి పుట్టిన వినూత్న కార్యక్ర మానికి 'ఆదివాసీ టూరిజం ఎక్స్‌పోజర్ ప్రోగ్రామ్' పేరుతో కార్యరూపం దాల్చనుంది. బు ధవారం ఉదయం 6 గంటలకు ఉట్నూరు మండలం గొండు గూడలో జెండా ఊపి ఈ వి జ్ఞాన యాత్రను మంత్రి జూప ల్లి స్వయంగా లాంఛనంగా ప్రా రంభించనున్నారు. కేవలం ప ర్యాటక ప్రదేశాలను చూడట మే కాకుండా, ఆదివాసీలు ప్ర పంచ పోకడలను, ఆధునిక అభివృద్ధిని, చారిత్రక వారస త్వాన్ని దగ్గరగా గమనించాల న్నది మంత్రి జూపల్లి కృష్ణారా వు ప్రధాన సంకల్పం. వారి ఆ లోచనల నుంచి పుట్టిన ఈ ప్రత్యేక విజ్ఞాన యాత్రలో ఉ ట్నూరు ప్రాంతానికి చెందిన సుమారు 650 మంది ఆదివా సీలు పాల్గొంటున్నారు. ఆది వాసీల సంస్కృతికి - నగర నాగరికతకు మధ్య వారధిని నిర్మించాలన్న మంత్రి ఆకాంక్ష ఈ కార్యక్రమం ద్వారా నెరవేర నుంది.

**యాత్ర సాగనుందిలా**

ఈ విజ్ఞాన యాత్రను మొత్తం మూడు విడతలుగా రూపక ల్పన చేశారు. ఏప్రిల్ 22 నుం చి 26 వరకు సాగే ఈ పర్యట నలో ఒక్కో బ్యాచ్‌కు 200 నుండి 250 మంది చొప్పున మూడు బ్యాచ్‌లుగా హైదరా బాద్‌ను సందర్శిస్తారు. వీరి సౌకర్యార్థం మంత్రి ఆదేశాల మేరకు 5 ప్రత్యేక ఏసీ బస్సు లను పర్యాటక శాఖ సిద్ధం చే సింది. హైదరాబాద్‌లోని అం తర్జాతీయ విమానాశ్రయం, చార్మినార్, గోల్కొండ కోట, తారామతి బరాదరి, లుంబినీ పార్క్, శిల్పారామం వంటి ప్రముఖ పర్యాటక ప్రాంతాల ను వీరు సందర్శించనున్నారు.

**అతిథి మర్యాదల్లో లోటు లేకుండా**

యాత్రకు వచ్చే అడవి బిడ్డ ల కు బస, భోజన వసతులలో ఎటువంటి లోటు రాకుండా చూడాలని మం త్రి ఇప్పటికే అధికారులను ఆదేశించారు. చారిత్రక కట్టడం తారామతి బరాదరిలో వీరికి బస ఏర్పా టు చేయడంతో పాటు, ఆత్మీ య ఆతిథ్యం అందించేందుకు పర్యాటక శాఖ అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. మారుమూల అడవుల నుంచి వచ్చే ఆదివా సీలకు ఈ రెండు రోజుల పర్య టన ఒక మధురమైన జ్ఞాప కంగా మిగిలిపోనుంది. పర్యా టక శాఖ, ఆదిలాబాద్ కలెక్ట ర్, ఐటీడీఏ అధికారులు ఏ ర్పాట్లను పర్యవేక్షిస్తారు.

# నార్నూర్ లో గుర్తింపును మించిన మార్పు ప్రయాణం

ప్రధాన మంత్రి అవార్డు అనంతర అభివృద్ధి కథ

**ఆదిలాబాద్ బ్యూరో, ఎప్రిల్ 20, (ప్రజా జ్యోతి)** గత 2025 ఏప్రిల్ 21న ఆది లాబాద్ జిల్లా నార్నూర్ బ్లాక్ కు ప్రజా పరిపాలనలో అత్యు త్తమ ప్రతిభకు గాను ప్రధాన మంత్రి అవార్డు లభించింది. ఇది గర్వకారణమైన ఘనత మాత్రమే కాకుండా, నార్నూర్‌కు కొత్త మార్పు ప్రయాణానికి శ్రీకారం చుట్టింది. ఈ గుర్తింపు తో నార్నూర్ నీటిని కేంద్రంగా చేసుకొని సమగ్ర అభివృద్ధి వ్యూహాన్ని చేపట్టింది. ఏప్రిల్ తర్వాత వెంటనే చెరువుల పునరుద్ధరణ పనులు ప్రారం భించబడ్డాయి. మొత్తం 10 సాగునీటి చెరువులు పునరు ద్ధరించబడి, 79,300 ఘన మీ టర్ల మట్టిని తొలగించి, నీటి నిల్వ సామర్థ్యం 30 లక్షల ఘన మీటర్లకు పైగా పెంచబడిం ది. జల్ శక్తి అభియాన్ కింద పెర్కొలేషన్ ట్యాంకులు, చెక్ డ్యామ్‌లు, బోర్‌వెల్ రీచార్జ్ నిర్మాణాలు తాడిహత్నూర్, సోనాపూర్, నాగల్కొండ, జాండా, గుంజాల వంటి గ్రా మాలలో చేపట్టబడ్డాయి. ఇవి భూగర్భ జలాల పెరుగుదలకు దోహదపడి వ్యవసాయానికి బలాన్నిచ్చాయి. మన బడి -- మన నీరు” కార్యక్రమం ద్వారా పాఠశాలల్లో వర్షపు నీటి సం గ్రహణ గుంతలు నిర్మించ బడ్డాయి. నీటి లభ్యత మెరుగు పడడంతో తాగు నీటి పై ప్రత్యేక దృష్టి పెట్టబడింది. నాందీ వాటర్స్ సహకారంతో నార్నూర్, ఖంపూర్, నాగల్కొండలో ఆర్ ఓ ప్లాంట్లు ఏర్పాటు చేయబడ్డాయి. సిహెచ్ సి నార్నూర్ లో కూడా ఆర్ ఓ ప్లాం ట్ ఏర్పా టు చేయడం ద్వారా ఆరోగ్య కేంద్రాల్లో సురక్షిత నీటి అందుబాటు పెరిగింది. ఆర్థికా భివృద్ధి దిశగా మహువా ల డ్డూ యూనిట్, బాంబూ ప్రాసె సింగ్ యూనిట్, దాల్ మిల్ వంటి ఉపాధి అవకా శాలు సృ ష్టించబడ్డాయి. మార్కెట్ లింకే జ్లు, రివాల్వింగ్ ఫండ్ మద్దతు ద్వారా రైతులకు మంచి ధర లు లభించాయి. 3700 చెట్లపై లాక్ సాగు చేపట్టి 370 గిరి జ న కుటుంబాలకు స్థిర ఆదా యం కల్పించబడింది. వ్యవ సాయంలో వాడి మూడు స్థా యిల సాగు విధానం, డ్రిప్ ఇరిగేషన్, సేంద్రీయ వ్యవసా యం, తేనెటీగల పెంపకం, ఆ యిల్ పామ్ సాగు వంటి పద్ధతులు అమలు చేయ బడ్డాయి. సాయిల్ హెల్త్ కార్డులతో శాస్త్రీయ వ్యవసాయం ప్రోత్స




హించబడింది. ఆస్పిరేషనల్ బ్లాక్స్ ప్రోగ్రామ్ కిందగృహ నిర్మాణం (హౌసింగ్), పిఎం జన్మాన్ ద్వారా గిరిజన అభి వృద్ధి చేపట్టబడింది. ఆరోగ్య రంగంలో టెలీమెడిసిన్ సేవ లు, ధర్మ సేవ వెల్నెస్ ప్రోగ్రామ్, మెన్స్ట్రుయల్ అవేర్‌నెస్ కార్యక్రమాలు అమలు చేయ బడ్డా యి. అంగన్వాడీ కేంద్రా లు బలోపేతం చేయబడి, పోషణ మేళాలు నిర్వహించ బడ్డాయి. రెండు సబ్‌సెంటర్లు ఎన్ క్యూఎఎస్ సర్టిఫికేషన్ పొందాయి. విద్యలో డిజిటల్ క్లాస్‌రూమ్స్, సైన్స్ ల్యాబ్స్, లై బ్రరీలు ఏర్పాటు చేయబడ్డా యి. ఇంగ్లీష్ లిటరసీ ప్రోగ్రామ్ ద్వారా 48.6% మెరుగుదల నమోదైంది. ప్రత్యేక అవసరాల పిల్లల కోసం ఏఐ ఆధారిత బోధన పద్ధతులు ప్రవేశపెట్ట బడ్డాయి. గిరిజన సంస్కృతిని పరిరక్షించేందుకు ట్రైబల్ మ్యూజియం స్థాపించబడింది. యువతలో నాయకత్వాన్ని పెంపొందించేందుకు యం గ్ లీడర్స్ క్లబ్బులు ఏర్పాటు చేయబడ్డాయి. ఈ సమగ్ర చ ర్యల ఫలితంగా నార్నూర్ అన్ని రంగాలలో అభివృద్ధిని సా ధించింది. విద్య, ఆరోగ్యం, వ్యవ సాయం, సామాజిక రం గాలలో గణనీయమైన పురో గతి సాధించబ డింది. దీని ఫలితంగా 2025 సెప్టెంబర్ క్వార్టర్‌లో దక్షిణ ప్రాంతం లో డెల్టా ర్యాంకింగ్‌లో 1వ స్థానం సాధించబడింది. నీతి అయోగ్ స్టేట్ యూజ్ కేస్ ఛాలెంజ్‌లో విద్య విభాగంలో 3వ స్థానం కూడా లభించింది. నార్నూర్ ప్రయాణం నీటి ఆధారిత, స మగ్ర అభివృద్ధి మోడల్‌గా ని లిచింది. ప్రధాన మంత్రి అవా ర్డు ద్వారా ప్రారంభమైన ఈ మార్పు, ఇప్పుడు స్థిరమైన అభివృద్ధి దిశగా కొనసాగు తోంది.

## మార్క్ ఫెడ్ మక్కల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన సిర్పూర్ (టి) శాసన సభ్యులు డా.పాల్వాయి హరీష్ రావు



**ఏప్రిల్ 20, సిర్పూర్ (టి) నియోజకవర్గ ప్రతినిధి ప్రజాజ్యోతి:** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్(టి)నియో జకవర్గంలోని కాగజ్ నగర్ మండలం పట్టణంలోని బీట్ మార్కెట్లో మార్క్ ఫెడ్ మక్కల కొనుగోలు కేంద్రాన్ని సిర్పూర్ (టి) ఎమ్మెల్యే డా.పాల్వాయి హరీష్ బాబు ప్రారంభిం చారు. ఈ సందర్భంగా శాసనసభ్యులు పాల్వాయి హరీష్ రావు మాట్లాడుతూ.. మక్కలు పండించిన రైతుల కోరిక మేరకు, వారికి పూర్తి మద్దతు ధర కల్పించాలనే ఉద్దేశంతో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు, ఇన్చార్జి మంత్రి జూపల్లి కృష్ణ రావు లతో మాట్లాడి సిర్పూర్ (టి)) నియోజకవర్గంలో రెండు మక్కా కొనుగోలు కేంద్రాలను మంజూరు చేయించడం జరిగిందని తెలిపారు. (1) మక్క కొనుగోలు కేంద్రాన్ని ఈ రోజు కాగజ్ నగర్ లో ప్రారంభించామని అన్నారు. (2)వ మక్క కొనుగోలు కేంద్రాన్ని కౌటాలలో ప్రారంభిస్తామని తెలిపారు. రైతులు దళారు లకు తక్కువ రేటుకు మక్కలు అమ్ముకోకుండా, రూ. 2400 మద్దతు ధర పొందవచ్చునని అన్నారు. ఈ కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి వెంకటి, డీసీఓ మోహన్, అగ్రికల్చర్ అధికారులు రామకృష్ణ, నాగరాజు, గిరిషన్, కార్తీష, ప్రేమలత, పీఏసీఎస్ కార్యదర్శి సతీష్ గౌడ్, ఏఈఓలు రేష్మిత, సృజన, జ్ఞానేశ్వర్, విశాల్, శ్రీనివాస్, రైతులు పాల్గొన్నారు.

## ఐదుగురు పేకాటరాయుళ్లపై కేసు నమోదు, ముగ్గురి అరెస్ట్

రూ 2,470 /- నగదు, రెండు మొబైల్ ఫోన్స్ స్వాధీనం

నిందితులలో ఇద్దరు ప్రభుత్వ ఉద్యోగులు

పులిమడుగు గ్రామ శివారు లో పేకాట ఆడుతున్న వ్యక్తులు

ఉట్నూర్ ఎస్సై గుంపుల విజయ్



**ఉట్నూర్, ఎప్రిల్ 20, (ప్రజా జ్యోతి)** ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో పులి మడుగు గ్రామ శివారు లో ఐదుగురు పేకాట ఆడుతున్నా రని విశ్వసనీయ సమాచారం మేరకు దాడి చేయగా, ముగ్గు రుని అరెస్టు చేయడం జరిగిం దని ఇద్దరు నిందితులు పారి పోవడం జరిగిందని ఉట్నూ ర్ ఎస్సై గుంపుల విజయ్ తెలి పారు. వీరి వద్దనుండి రెండు మొబైల్ ఫోన్స్, రూ 2470/- నగదు స్వాధీనం చేసుకోవడం జరిగిందని, వీరిపై ఉట్నూర్ పోలీస్ స్టేషన్ లో కేసు నమో దు చేయడం జరిగిందని తెలి పారు. నిందితులు జాదవ్ శ్రీనివాస్ (46) టీఎస్ ఎన్పి డీసీఎల్ ఉద్యోగి, సుంకే రాజేశ్వర్ (46), రాథోడ్ అజయ్ (35)లు ముగ్గురు అరెస్ట్ కాగా రాథోడ్ ప్రకాష్ (48) ప్రభుత్వ టీచర్,రాథోడ్ రవీందర్ (46) లు పరారీలో ఉన్నట్లు తెలిపారు. పేకాట ఆడుతున్న వారిపై ఎలాంటి స మాచారం ఉన్న వెంటనే డయ ల్ 100 ద్వారా పోలీసులకు సమాచారం అందించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఎలాంటి అసాంఘిక కార్యకలా పాలు నిర్వహించిన వారిపై చర్యలు తప్పవని హెచ్చరిం చారు. ఈ కార్యక్రమంలో సి బ్బంది దత్తాత్రి తదితరులు పాల్గొన్నారు.

## సిర్పూర్(టి)గోవింద్ పూర్‌లో అగ్నిప్రమాద ఘటనలో ఇల్లు దగ్ధం

కాలిపోయి బూడిదైనా ఇంటి సామాగ్రి కట్టుబట్ట లతో మిగిలిన యజమాని గౌరుబాయి



**ఏప్రిల్ 20, సిర్పూర్ (టి) నియోజకవర్గ ప్రతినిధి ప్రజాజ్యోతి:** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్(టి) మండలంలోని గోవింద్ పూర్ కాలనీలో సోమవారం ఆకస్మిక అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. ఈ ప్రమాద ఘటనలో గోవిందూర్ కాలనీకి చెందిన చన్కాపూరే గౌరుబాయి నివాస గృహం పూర్తిగా దగ్ధమైంది. ఇల్లు ఒక్కసారిగా మంటల్లో చిక్కుకోవడంతోస్థానికులు మంటలను ఆర్పేందుకు ప్రయత్నించినా ఫలితం లేకుండా పోయింది. ఈ ప్రమాదంలో ఇంట్లోని సామాగ్రి అంతా కాలి పోవడంతో బాధితురాలు కట్టుబట్టలతో మిగిలింది. ప్రమాదానికి గల కారణాలు తెలియాల్సి ఉంది. దగ్ధమైన ఇల్లు ను అధికారులు సందర్శించి బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

# సమానత్వ సమాజ స్థాపన బసవేశ్వరుని ధ్యేయం

**ఆయన చూపిన మార్గంలో ప్రతి ఒక్కరూ నడుచుకోవాలి**

**ఆదిలాబాద్ లో ఘనంగా బస వేశ్వర జయంతి వేడుకలు**



**ఆదిలాబాద్ బ్యూరో, ఎప్రిల్ 20, (ప్రజా జ్యోతి)** కుల రహిత, సమానత్వ స మాజ స్థాపన ధ్యేయంగా కృ షిచేసిన మహాసంస్కర్త మహా త్మా బస వేశ్వరుడని ప్రజా ప్రతినిధులు, అధికారులు కొని యాడారు. సోమవారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో బస వేశ్వర జయంతి వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. బస వేశ్వర విగ్రహానికి ఆదిలాబాద్ ఎంపీ జి. నగేష్, ఎమ్మెల్యే పా యల్ శంకర్, అదనపు కలెక్టర్ చిత్రు, మున్సిపల్ చైర్ పర్సన్ అనూష పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.కులరహిత, సమానత్వ సమా జ స్థాపనే ధ్యేయంగా కృషి చే సిన మహా సంస్కర్త మహాత్మా బసవేశ్వరుడని ప్రజా ప్రతిని ధులు, అధికారులు కొనియాడారు. సోమవారం బసవేశ్వర జయంతిని పురస్కరించుకుని పట్టణం లోని భూక్తపూర్ కూడలి వద్ద బసవన్న విగ్రహానికి స్థానిక ఎంపీ, ఎమ్మెల్యేతో పాటు జిల్లా ఉన్నతాధికారులు ఘనంగా నివాళులర్పించారు. తొలుత విగ్రహానికి ప్రత్యేక పూ జలు నిర్వహించి, పూలమాల లు వేసి అంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఎంపీ నగేష్ మాట్లాడుతూ12వ శతాబ్దంలోనే స్త్రీ, పురుష సమాన త్వం కోసం బసవన్న గళం వి ప్పారని గుర్తు చేశారు. "కాయ కమే కైలాసం" అనే సూత్రంతో శ్రమ గౌరవాన్ని చాటిచెప్పిన ఆయన బోధనలు నేటికీ ఆచ రణీయమని పేర్కొన్నారు. ఆయన స్థాపించిన 'అనుభవ మంటపం' ప్రపంచంలోనే మొ దటి ప్రజాస్వామ్య వేదిక అని కొనియాడారు.ఆయనఆశయ సాధనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు.అనంతరం ఎమ్మెల్యే పాయల శంకర్ మాట్లాడుతూ సమాజంలోని మూఢనమ్మకాలను పారద్రోలి,మా నవత్వమే మతంగా బసవేశ్వ రుడు జీవించారని అన్నారు. అట్టడుగు వర్గాల అభ్యున్నతి కోసం ఆయన చేసిన కృషి మ రువలేనిదని, ప్రభుత్వ పరంగా బసవన్న ఆశయాల సాధ నకు కట్టుబడి ఉన్నామని స్పష్టం చేశారు.జిల్లా అదనపు కలెక్టర్ రాయి సిడాం చిత్రు మాట్లాడుతూ బసవన్న చెప్పి న వచనాలు కేవలం సాహి త్యం మాత్రమే కాదని, అవి జీవన వేదాలని అభివర్ణించా రు. జిల్లాలోని అన్ని వర్గాల ప్ర జలు ఆయన చూపిన మార్గం లో నడవాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో బీసీ వె ల్ఫేర్ అధికారి, డి సోనియా ఇతర అధికారులు ప్రజా ప్రతి నిధులు తదితరులు పాల్గొ న్నారు.

# నకిలీ ఉద్యోగాల పేరుతో మోసం చేసిన నిందితుడు అరెస్ట్, రిమాండ్

**స్పైస్ జెట్ లో ఉద్యోగం పేరు తో లక్షల్లో దోపిడీ బాధితురాలి ఫిర్యాదుతో మా వల పోలీస్ స్టేషన్లో కేసు నమోదు**

**ఎస్ఐ రాజశేఖర్ రెడ్డి**




**మావల, ఎప్రిల్ 20, (ప్రజా జ్యోతి)**మావాల పోలీస్ స్టేషన్ పరి ధిలో నకిలీ ఉద్యోగాల పేరుతో నిరుద్యోగులను మోసం చేస్తు న్న వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేసి, రిమాండ్ కు తరలించిన ట్లు మావలా ఎస్సై రాజశేఖర్ రెడ్డి తెలిపారు. స్పైస్‌జెట్ ఎ యిర్‌పోర్ట్ ఉద్యోగాల పేరుతో లక్షల్లో మోసం చేసిన ఘటన వెలుగులోకి వచ్చింది.

**వివరాల్లోకి వెళ్తే,**

నిందితుడు వాగ్మారే రాజర త్న (37), కేఆర్‌కే కాలనీ, ఆ దిలాబాద్ నివాసి (మూలం: నాందేడ్ జిల్లా, మహారాష్ట్ర) "జూబిలీ ఓవర్సీస్ ఆన్‌లైన్ ఫెసిలిటీ లోన్స్", "స్పైస్‌జెట్ లిమిటెడ్ ఎయిర్‌పోర్ట్ జాబ్స్" పేరుతో భుక్తాపూర్‌లో నకిలీ కార్యాలయం నిర్వహిస్తూ, తా ను స్పైస్‌జెట్ సంస్థకు చెందిన అధికారి అని చెప్పి ఉద్యోగా ర్థులను నమ్మించి డబ్బులు వసూలు చేస్తున్నాడు. బాధి తురాలు నిజామాబాద్ జిల్లా కు చెందిన జాధవ్ రమా బాయి ఫిర్యాదు మేరకు ఈ కేసు నమోదు చేశారు. అక్టోబర్ 2023లో ఆమె ఇద్దరు కుమా ర్తెలకు హైదరాబాద్ ఎయిర్ పోర్ట్‌లో ఉద్యోగాలు ఇప్పిస్తానని చెప్పి ?3,40, 000 నగదు, ఆన్‌లైన్ ద్వారా తీసుకున్నాడు. మోసం కొనసాగిం చేందు కు నిందితుడు చిన్న కుమార్తె కు నకిలీ అపాయింట్‌మెంట్ లెటర్‌ను ఈమెయిల్ ద్వారా పంపించాడు. అలాగే హైద రా బాదు ఎయిర్‌పోర్ట్ సమీపంలో హాస్టల్‌లో చేర్పించి అదనపు ఖర్చులు చేయించాడు. అనం తరం కార్యాలయం మూసివే సి పరారయ్యాడు.విశ్వసనీ య సమాచారం మేరకు మా వాల పోలీస్ స్టేషన్ సబ్ ఇన్స్పెక్టర్ నేతృత్వంలోని బృందం 20 ఏప్రిల్ 2026 ఉదయం రాంనగర్, ఆది లా బాద్‌లో నిందితుడిని అరెస్ట్ చేయడం జరిగిందని తెలి పా రు.నిందితుడి వద్ద నుండి మో సాలకు ఉపయోగించిన వీవో మొబైల్ ఫోన్, డబ్బుల లావా దేవీలకు సంబంధించిన డిజిట ల్ ఆధారాలు, నకిలీ ఈమెయి ల్ కమ్యూనికేష న్ వివరాలను పోలీసులు స్వాధీనం చేసుకు న్నారు. విచారణలో నిందితు డు తన నేరాన్ని ఒప్పుకొని, అ దే గ్రామానికి చెందిన మరో మ హిళ నుండి ?4,50,000 మో సం చేసినట్లు వెల్లడించాడు. ఈ మోసాలకు సంబంధించి మరింత మంది బాధితులు ఉన్నారా అన్న కోణంలో పోలీ సులు దర్యాప్తు కొనసాగిస్తు న్నారు. ప్రజలు ఇలాంటి మో సాలకు గురికాకుండా అప్రమ త్తంగా ఉండాలని ఆదిలాబాద్ జిల్లా పోలీసులు సూచించా రు.స్పైస్‌జెట్ వంటి సంస్థలలో ఉద్యోగ నియామకాలు అధి కారిక వెబ్‌సైట్లు, చట్టబద్ధ మార్గాల ద్వారానే జరుగుతా యని, "ఖచ్చితమైన ఉద్యో గం" పేరుతో డబ్బులు అడిగే వ్యక్తులను నమ్మవద్దని సూ చించారు.

## గాయకుడికి ఘనంగా సన్మానించిని ఆదర్శ పాఠశాల యాజమాన్యం



**దిలావర్ పూర్ ,ఎప్రిల్ 20 ,( ప్రజాజ్యోతి ).**దిలావర్పూర్ మండ ల కేంద్రానికి చెందిన గాయకుడు రచయిత కదంబ రత్నాకర్‌ను సోమవారం ఆదర్శ పాఠశాల యాజమాన్యం ఘనంగా సన్మానించారు. అక్షరం తెలియని కవిగా, స్వరాలు నేరువని గాయకుడిగా అద్భుత పాటలు అందిస్తున్నారని ప్రిన్సిపల్ శ్రీనివాస్ తెలిపారు. ఎన్నో అద్భుతమైన రచనలు చేసి పాటలు పాడడాన్ని అభినందించారు. అంబేద్కర్ జయంతి సందర్భంగా తన స్వయంగా రచన చేసి అద్భుతంగా పాడాడు. దీంతో గ్రామస్తులు ఆయనను ఘనంగా సన్మానించి కొనియాడారు. కొన్ని అక్షరాలు నేర్చుకొని పాటలు రచించి తానే స్వయంగా పాడటం చాలా గొప్ప విషయమని తెలిపారు. భవిష్యత్తులో మరింత ఎత్తుకు ఎదిగి ఉన్నత శిఖరాలు చేరుకోవాలని శాలువాతో సన్మానించి జ్ఞాపికలను అందజేశారు. ఇందులో పాఠశాల ఉపాధ్యాయులు గ్రామస్తులు ఉన్నారు

## పోలీసుల పట్ల ప్రజలలో న మ్మకం పెంచేలా సమస్యల పరిష్కారం ఉండాలి

**పోలీసు ముఖ్య కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల రోజు నిర్వహణ**

**స్వయంగా 38 ఫిర్యాదుల స్వీకరణ**

**జిల్లా నలుమూలల నుండి వి చ్చేసిన ఫిర్యాదుదారులు**

**సమస్యలు విన్న వెంటనే ఫోన్ ద్వారా సంబంధిత అధికారు లకు ఆదేశాలు జారి జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్**



**ఆదిలాబాద్ బ్యూరో, ఎప్రిల్ 20, (ప్రజా జ్యోతి)** ప్రజా ఫిర్యాదుల పట్ల బాధ్యత యుతంగా వ్యవహరిస్తూ ఫి ర్యాదులను త్వరితగతిన పరి ష్కరించి పోలీసుల పట్ల ఉన్న నమ్మకాన్ని మరింత పెంపొం దించేలా కృషి చేయాలని జి ల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐ పీఎస్ సూచించారు. సోమ వారం పోలీసు ముఖ్య కార్యా లయం లో ప్రజా ఫిర్యాదుల రోజును నిర్వహించిన జిల్లా ఎస్పీ ప్రజల ఫిర్యాదులను నే రుగా స్వీకరించారు. జిల్లా న లుమూలల నుండి వచ్చిన 38 మంది ఫిర్యాదుదారులు నేరుగా తమ సమస్యలను జి ల్లా ఎస్పీకి తెలియజేయగా వెంటనే సంబంధిత పోలీసు అధికారులకు ఫోన్ ద్వారా స మస్యలను త్వరితగతిన పరి ష్కరించాలని ఆదేశించారు. సమస్యలను విన్నవించిన వా రిలో ఎక్కువగా కుటుంబ కల హాలు, భార్యాభర్తల సమస్య లు, కేసుల పురోగతులు, భూ తగాదాలు, కొట్లాటల సమస్య లు తదితర సమస్యలతో జి ల్లా ఎస్పీని నేరుగా సంప్రదించ డం జరిగింది. బాధితుల పట్ల గౌరవంగా వ్యవహరిస్తూ సమ స్యలను పరిష్కరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమం లో సిసి కొండరాజు, ప్రజా ఫి ర్యాదుల విభాగం అధికారిని జైస్వాల్ కవిత, సిబ్బంది తది తరులు పాల్గొన్నారు.

# ప్రతి పోలీస్ స్టేషన్ల లో రిసిప్షన్ల పాత్ర కీలకమైనది

జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్

బాధితుల ఫిర్యాదులకు సత్వర పరిష్కారం అందించేలా కృషి చేయాలి

పోలీస్ స్టేషన్ కు వచ్చే బాధితుల పట్ల గౌరవంగా వ్యవ హరించాలి

న్యాయ విచారణ జరిపి, దర్యాప్తు రిపోర్ట్ ను రిసెప్షన్ లలో పొందుపరచాలి

ప్రతి ఒక్క పోలీస్ సిబ్బందితో పిటిషన్ ఎంక్వయిరీ జరిగాలా చూసుకోవాలి

రిసెప్షన్ సిబ్బందితో ప్రత్యేక సమీక్ష సమావేశం



**ఆదిలాబాద్ బ్యూరో, ఎప్రిల్ 20, (ప్రజా జ్యోతి)** ప్రతి పోలీస్ స్టేషన్ లో రిసెప్షన్ సెంటర్ ల పాత్ర కీలకంగా వ్య వహరిస్తుందని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్ తె లిపారు. సోమవారం జిల్లా వ్యాప్తంగా ఉన్న రిసెప్షనిస్టూ లతో సమావేశం ఏర్పాటు చేసి సిబ్బందికి పలు సూచన లు చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ పో లీస్ స్టేషన్ కు వచ్చే ఫిర్యాదు దారుల పట్ల గౌరవంగా వ్యవ హరిస్తూ, బాధితులకు సత్వర న్యాయం అందించే విధంగా కృషి చేయాలని తెలియజేశా రు. సిబ్బంది బాధితుల ఫిర్యాదులను స్వీకరించిన వెంటనే పోలీస్ స్టేషన్ ఇంచార్జ్ ద్వారా విలేజ్ పోలీస్ ఆఫీసర్ కు అప్పగించి సరైన దర్యాప్తును కొ నసాగించి, అదేవిధంగా సం ఘటనా స్థలంలో ఉన్న సాక్షు ల వాంగ్మూలాన్ని నమోదు చేసి వారి సంతకాలతో కూడిన రిపోర్టును రిసెప్షనిస్టు అందజే యాలని, ఒకవేళ రాజీ పొంది తే రాజీ పత్రంపై ఇరు వర్గాల వారి సంతకాలు సాక్షుల సం తకాలతో కూడిన పత్రాలను నమోదు చేసుకొని ఉండాలని తెలియజేశారు. జిల్లా వ్యాప్తం గా ఉన్న ప్రతి గ్రామంలో ఒక విలేజ్ పోలీస్ ఆఫీసర్ ఉండే విధంగా చూసుకుంటూ వారికి రిసెప్షన్ ఎంక్వైరీ ఫిర్యాదుల ను అందించి దర్యాప్తు నివేదిక లను సరైన సమయంలో అం దేలా పర్యవేక్షించాలని తెలి పారు. ఎంక్వయిరీ చేసిన అధి కారి తన దర్యాప్తుతో పాటు ఒక ఛాయాచిత్రాన్ని రిపోర్టు లో పొందుపరచాలని తెలిపా రు. ప్రతి పోలీస్ స్టేషన్ కు వ చ్చే ప్రతి ఒక్క ఫిర్యాదు ను ఆన్లైన్లో నమోదు చేసి దర్యా ప్తు చేపట్టాలని తెలియజేశా రు. సెల్ఫోన్ బాధితుల ఫిర్యాదులను స్వీకరించి ప్రత్యేక రిజిస్టర్లో ఫిర్యాదులను నమో దు చేయాలని, ఇకనుండి ప్రతి ఫిర్యాదు పై ఫీడ్ బ్యాక్ తీసు కోవడం జరుగుతుందని, దాని ని బట్టి పోలీసుల పనితీరు తె లుస్తుందని, బాధితులతో సక్ర మంగా ప్రవర్తించాలని తెలిపా రు. మహిళా సిబ్బంది ప్రతి ఒ క్కరూ అన్ని రకాల విధులను చేస్తూ ఆదర్శంగా ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డబ్ల్యూపీఎస్ ఇన్స్పెక్టర్ ప్రేమ్ కుమార్, డిసిఆర్బి ఎస్సై ప్రవీ ణ్, రిసెప్షనిస్టూలు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## జగిత్యాల సభకు హరీష్ దూరం

**కరీంనగర్ :** బీఆర్ఎస్ కీలక నేతల్లో ఒకరైన ట్రబుల్ షూటర్ మాజీ మంత్రి హరీష్ రావు జగిత్యాల బహిరంగ సభకు అందుబాటులో ఉండటం లేదు. ఆయనతో పాటు బి. వినోద్ కుమార్, రాజ్యసభ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర ఢిల్లీకి వెళ్లారు. నేటి సాయంత్రం ఢిల్లీలో సీనియర్ లాయర్లతో సమావేశమై కొన్ని కీలక అంశాలపై చర్చించనున్నారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ నిర్మాణంలో అవకతవకలపై విచారణకు ఏర్పాటు చేసిన జస్టిస్ ఘోష్ కమిషన్ నివేదికను సవాల్ చేస్తూ బీఆర్ఎస్ నేతలు తెలంగాణ హైకోర్టులో ఇదివరకే పిటిషన్ దాఖలు చేయడం తెలిసిందే. ఏప్రిల్ 8న వెల్లడించాల్సిన తీర్పును హైకోర్టు ఏప్రిల్ 22కు వాయిదా వేసింది. తీర్పు కనుక తమకు వ్యతిరేకంగా ఏం చేయాలి, న్యాయపరంగా ఎలా ముందుకు వెళ్లాలి, సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేయడంపై ఢిల్లీలో సీనియర్ లాయర్లతో చర్చించడానికి హరీష్ రావు ఢిల్లీకి వెళ్లడంతో ఆయన లేకుండా కేసీఆర్, కేటీఆర్ జగిత్యాల సభను నడిపించనున్నారు. ఏడాది తరువాత కేసీఆర్ హాజరై ప్రసంగించనున్న సభకు హరీష్ రావు అందుబాటులో లేకపోవడంపై పార్టీ శ్రేణులు, ఆయన అభిమానులు చర్చించుకుంటున్నారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారెంటీలు, 420 హామీల అమలును కేసీఆర్ అస్త్రంగా మార్చుకోను న్నారు. ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఆయన బహిరంగ సభలకు దూరంగా ఉంటూ, కొత్త ప్రభుత్వానికి తగిన సమయం ఇచ్చారు. అయితే, ఇప్పుడు దాదాపు రెండున్నరేళ్ల కాంగ్రెస్ పాలన ముగియడంతో, రైతులు, ఇతర వర్గాల ప్రజల్లో పెరుగుతున్న వ్యతిరేకతను ఈ సభ ద్వారా ఎండగట్టాలని బీఆర్ఎస్ భావిస్తోంది. గత ఏడాది వరంగల్ ప్లీనరీ తర్వాత కేసీఆర్ పాల్గొంటున్న భారీ సభ ఇదే కావడంతో, ఆయన దిశానిర్దేశం కోసం పార్టీ శ్రేణులు ఉత్కంఠగా ఎదురుచూస్తున్నాయి. జగిత్యాల గడ్డపై కేసీఆర్ నిర్వహించిన సభలన్నీ విప్లవాత్మక మార్పులకు నాంది పలికాయి. 2001లో పార్టీ ఆవిర్భావం తర్వాత ఇక్కడ జరిగిన తొలి సభతోనే బీఆర్ఎస్ స్థానిక సంస్థల ఎన్నికల్లో ఘనవిజయం సాధించింది. అలాగే, 2003లో ధర్మపురిలో కేసీఆర్ చేసిన సింహగర్జనతో అప్పటి ఉమ్మడి ఏపీ ప్రభుత్వం దిగివచ్చి గోదావరి

## హిమయత్ నగర్ శ్రీ వేంకటేశ్వర స్వామివారి ఆలయాన్ని సందర్శించిన టిటిడి ఈవో ఎం రవిచంద్ర

హైదరాబాద్: హిమయత్ నగర్ శ్రీ వేంకటేశ్వర స్వామివారి ఆలయాన్ని టిటిడి ఈవో ఎం. రవిచంద్ర సోమవారం సందర్శించారు. ఆలయానికి విచ్చేసిన ఈవోకు స్థానిక ఎల్. ఏ.సీ. అధ్యక్షులు జి. శంకర్ గౌడ్, అధికారులు సాదర స్వాగతం పలికారు. ఈవో స్వామి వారిని దర్శనం అనంతరం వేద పండితుల వేదాశీర్వచనాలు చేశారు. అనంతరం స్వామి వారి తీర్థప్రసాదాలను అందించారు. ఈ సందర్భంగా ఆలయంలోని టిటిడి సమాచార కేంద్రం, కల్యాణ మండపం, ఎస్వీబీసీ కార్యాలయం, గెస్ట్ హౌస్‌తో పాటు ఆలయ పరిసరాలను సమగ్రంగా పరిశీలించారు. హిమయత్ నగర్, జూబ్లీ హిల్స్ ఆలయాలకు రోజువారీ, వారాంతాల్లో విచ్చేసే భక్తుల సంఖ్యపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. భక్తులకు అందిస్తున్న స్వామివారి సేవలు, వాటి ధరలు, కల్యాణ మండపాల నిర్వహణ విధానం, అలాగే స్వామివారి సేవలను ఆన్‌లైన్ ద్వారా మరింత సులభంగా అందించే అంశాలపై సమగ్ర నివేదిక సమర్పించాలని అధికారులను ఆదేశించారు. తెలంగాణ రాష్ట్రంలో మొత్తం 78 టిటిడి కల్యాణ మండపాలు ఉండగా, అందులో 41 లీజ్ పద్ధతిలో, 37 టిటిడి ఆధ్వర్యంలో నిర్వహణలో ఉన్నట్లు ఇంజనీరింగ్ అధికారులు వివరించారు. వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని భక్తులకు త్రాగునీటి సదుపాయం, సౌకర్యవంతమైన క్యూ లైన్లు, అవసరమైన అన్ని ఏర్పాట్లు కల్పించాలని ఇంజనీరింగ్ అధికారులకు ఆదేశిం చారు. ఆలయ పరిసరాలను పరిశుభ్రంగా, పవిత్రంగా ఉంచాలని సూచించారు. అనంతరం శ్రీవారి సేవలో పాల్గొంటున్న సేవకులతో ఈవో మాట్లాడి, రోజువారీ సేవకుల సంఖ్య, వారి సేవా విధానం వంటి అంశాలను తెలుసుకున్నారు.

## ఓ వివాహిత మహిళ పై అత్యాచారం, ఉప సర్పంచ్ అరెస్ట్

నిందితుడిని రిమాండ్ కు తరలించిన సిర్పూర్ (టి) పోలీసులు

**ఏప్రిల్ 20, సిర్పూర్ (టి) నియోజకవర్గ ప్రతినిధి ప్రజాజ్యోతి:** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్(టి) మండలంలో ఓ వివాహిత మహిళపై అత్యాచారానికి పాల్పడిన కేసులో స్థానిక ఉపసర్పంచ్ దుర్గం ప్రశాంత్ ను పోలీసులు సోమవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. సిర్పూర్ (టి)ఎస్.ఐ సాగర్ తెలిపిన వివరాల ప్రకారం ప్రశాంత్ తనకు తెలిసిన ఓ మహిళ ఫోన్ నెంబర్ తీసుకొని ఆమెతో పరిచయం పెంచుకున్నా రని ఈ క్రమంలో ఈ నెల 18న అర్ధరాత్రి సమయం లో బాధితురాలి ఇంట్లోకి అక్రమంగా చొరబడి ఆమె పై బలవంతంగా అత్యా చారానికి పాల్పడ్డాడు. అదే సమయంలో బాధితురాలి భర్త ఇంటికి చేరుకోగా నిందితుడు అతడిని నెట్టివేసి అక్కడి నుండి పరారయ్యా డని ఈ దారుణ ఘటనపై బాధితురాలు తన భర్తతో కలిసి సిర్పూర్ (టి) పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారని అట్టి ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టి నిందితుడు దుర్గం ప్రశాంత్‌ను అరెస్టు చేసి సిర్పూర్ (టి)మెజిస్ట్రేట్ ఎదుట హాజరు పరిచి రిమాండ్ కు తరలించడం జరిగిందని ఎస్ఐ సాగర్ తెలిపారు. తదుపరి దర్యాప్తు కొనసాగు తుందని వెల్లడించారు.

## డిఆర్ డిపోలను, పెట్రోల్ బం క్ లను ఆకస్మికంగా తనిఖీ చేసిన జీసిసి డిఎం






ఆదిలాబాద్ జిల్లా లోని పలు గిరిజన ప్రాంతాల్లో గిరిజన స హకార సంస్థ ( జీసీసీ) ఆధ్వ ర్యంలో కొన సాగుతున్న పలు వ్యాపార సంస్థ లను ఆ సంస్థ ఉట్నూర్ డివిజనల్ మేనేజర్ గుడిమళ్ల సందీప్ ఆకస్మికం గా తనిఖీ చేశారు. ఆదిలాబాద్ జిల్లా నార్నూర్ మండలం లో ని నార్నూర్, బీంపూర్‌లి నిత్యా వసర వస్తువుల దుకాణాలు (డిఆర్డిపో) లను నార్నూర్ జీసీసీ పెట్రోల్ బంకు ను సోమ వారం ఉట్నూర్ గిరిజన సహ కార సంస్థ (జీసీసీ) డివిజనల్ మేనేజర్ (డీఎం) గుడిమళ్ల సందీప్ కుమార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డిఆర్ డిపోలలో, పెట్రోల్ బం కులోని రికార్డులను తనిఖీ చే శారు. రికార్డులు ఎప్పటి కప్పు డు అప్డేట్ చేయాలని, అవస రానికి తగ్గట్లు ఇంధనం తెచ్చు కోవాలని అని సూచించారు. నార్నూర్ డిఆర్ డిపోలో జీసీ సీ కి సంబంధం లేని వ్యక్తి ని సహాయకునిగా పెట్టుకొని వి ధులు నిర్వహించటం చూసి ఆగ్రహం వ్యక్తం చేశారు. సం బంధిత సేల్స్ మెన్ కు షోకాజ్ నోటీస్ ఇవ్వాలని ఉట్నూర్ సొసైటీ మేనేజర్ ను ఆదేశిం చారు. విధుల నిర్వహణ లో అలసత్వం వహించినట్లయితే కఠిన చర్యలు తీసుకుంటా మనిలి ఈ సందర్భంగా సందీప్ కుమార్ హెచ్చరించారు. త ర్వాత ప్రభుత్వం ప్రతిష్టత్మకం గా చేపట్టిన ప్రజా పాలన -ప్ర గతి ప్రణాళిక - 99రోజులు - సంక్షేమ వారంలి కార్యక్రమం లో భాగంగా నార్నూర్ మండ లం భీంపూర్ లోని గిరిజన బా లుర వసతి గృహాన్ని జీసీసీ డీ ఎం సందీప్ కుమార్ సందర్శిం చారు. వంట గది, తరగతి గ దులు, మూత్రశాలలు, డార్మి టరీ, స్టోర్ రూమ్ పరిశీలించా రు. రిజిస్టర్లు తనిఖీ చేసి వసతిగృహ సంక్షేమ అధికారి సాయి ప్రసాద్ కి పలు సూచ నలు చేశారు.